## బీహార్ ప్రభావం బెంగాల్‌పై ఉండదు

కోల్‌కతా,బిహార్‌లో ఎన్డీయే ఘన విజయం సాధించింది. మహాగర్‌బంధన్‌కు ఊహించని ఓటమి ఎదురైంది. బిహార్‌లో పని పూర్తయ్యిందన్న కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్.. ఇక పశ్చిమ బెంగాల్ వంతు అని కామెంట్ చేశారు. దీంతో, బెంగాల్‌లోని బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం ఎగసిపడుతోంది. అయితే, బిహార్ ఎన్నికల ప్రభావం బెంగాల్‌పై ఉండదని అధికారి టీఎమ్‌సీ వర్గాలు తేల్చి చెబుతున్నాయి.బిహార్ ఫలితాల తరువాత బెంగాల్‌లో బీజేపీ సాల్ట్ లేక్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరుకున్న మద్దతుదారులు సంబరాలు చేసుకున్నారు. నందీగ్రామ్ నుంచి కూచ్ బేహార్ వరకూ బెంగాల్‌లోని పార్టీ కార్యాలయాల్లో హర్షాతిరేకాలు మిన్నంటాయి. బెంగాల్ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని, అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీని నిమజ్జనం చేయకతప్పదని కొందరు కామెంట్ చేశారు. బిహార్‌లో గెలుపుపై బెంగాల్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య స్పందించారు. 'ఇక పోరు బెంగాల్‌లో మొదలవుతుంది. ఎన్నికల్లో టీఎమ్‌సీ నిమజ్జనం పక్కా అని మేము విశ్వసిస్తున్నాము. దీదీ సోదరుడు అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించాము.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :226 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 16-11-2025 | పేజీలు:4 వెల: 2.00


# ఇది ఇండియా కూటమికి ఓ పాఠం..



చెన్నై:యావత్ దేశం ఆసక్తికనబరిచిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభంజనం సృష్టించింది. రెండు విడతల్లో 243 స్థానాలకు జరిగిన ఎలక్షన్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డేయే కూటమి 202 స్థానాల్లో జయభేరి మోగించింది. ఇక అధికారంలోకి రావాలనుకున్న ప్రతిపక్ష మహాఘుర్‌బంధన్ కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గత ఎన్నికల్లో సాధించిన సీట్లలో సంగం కూడా దక్కించుకోలేక చితికిలపడింది. కేవలం 34 స్థానాలతో సరిపెట్టుకుంది. ఈ నేపథ్యంలో బీహార్‌లో ఇండియా కూటమి ఓటమిపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీహార్ ఫలితాలు ఇండియా కూటమికి ఓ పాఠం అని పేర్కొన్నారు. ఈ మేరకు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు. ఎన్నికల్లో విజయం కోసం తీవ్రంగా కృషి చేసిన ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌కు కూడా అభినందనలు తెలిపారు. 'ఎన్నికల ఫలితాలు సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక, సైద్ధాంతిక సంకీర్ణాలు, రాజకీయ సందేశంపై ఆధారపడి ఉంటాయి. ఇండియా కూటమిలో అనుభవజ్ఞులైన రాజకీయ నాయకులు ఉన్నారు. సవాళ్లను పరిష్కరించేందుకు వ్యూహాత్మకంగా ప్రణాళిక వేయగల సామర్థ్యం కలిగిన నాయకులు ఉన్నారు. ఈ ఫలితాలు ఇండియా కూటమికి ఓ పాఠం లాంటివి. దీంతో ఎంతో నేర్చుకోవాలి' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘంపై కూడా స్టాలిన్ విమర్శలు చేశారు. ఈ ఫలితంలో ఈసీపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా కొట్టిపారేయలేమని వ్యాఖ్యానించారు. ఈసీ ప్రతిష్ట దిగజారిపోయిందన్నారు.

# ఒక్క ఉప ఎన్నికలో ఎందుకింత హంగామా?

హైదరాబాద్,ఉప ఎన్నిక ఎక్కడ వచ్చినా ఇటీవల కాలంలో పార్టీల నాయకత్వం వ్యక్తిగత ప్రెస్టేజీగా భావిస్తున్నారు. రాష్ట్రంలో రాజకీయ మార్పునకు ఈ ఎన్నికల ఫలితమెంత దోహదం చేస్తుందో ఏమోగానీ.. పతాక స్థాయి ప్రచారం చేశారు. కోట్లాది రూపాయలు కుమ్మరించాయి. విజయం సాధించేందుకు సకల శక్తులను మోహరిస్తూ ఒక్క ఉప ఎన్నికను రాష్ట్ర ఎన్నికగా మార్చివేశారు. దీంతో ఉప ఎన్నికలంటేనే కొన్ని పక్షాలు పోటీకి వణికిపోతున్నాయిఒకప్పుడు అనివార్యకారణాలతో ఉప ఎన్నికలొస్తే పోటీలేకుండా ఏకగ్రీవంగా ఎన్నికకు అన్ని పక్షాలు అంగీకరించే పరిస్థితి నుంచి, ఇప్పుడు ఎన్నికొస్తే పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో హుజురాబాద్ ఉప ఎన్నిక.. మొత్తం ఉప ఎన్నికలను పీక్ స్టేజీకి చేర్చిన విషయం తెలిసిందే. ఇక దుబ్బాక, నారాయణఖేడ్, హుజుర్ నగర్, నాగార్జున సాగర్, పాలేరు ఉప ఎన్నికల తీరు ఎలాసాగిందో అందరికీ తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఇప్పటికే రెండు ఉప ఎన్నికలు పూర్తయ్యాయి. కంటోన్మెంటు ఎన్నికలు సాధారణ ఎన్నికల్లో కలిసిపోవడంతో పోటీ పెద్దగా కనిపించలేదుగానీ, ప్రస్తుతం ముగిసిన జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో విజయం కోసం మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సర్వశక్తులొడ్డాయి. రాష్ట్రంలో మరో సమస్యలేనట్లు జూబ్లీ ఎన్నిక చుట్టూ రాజకీయాన్ని మార్చివేశారు. ఈ ఉప ఎన్నికల గెలుపోటములు రాష్ట్రంలో అధికారాన్ని తలకిందులు చేస్తాయనే స్థాయిలో ప్రచారం సాగింది. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులు ప్రచారాన్ని కొనసాగించారు.ఉప ఎన్నిక ఎక్కడ వచ్చినా ఇటీవల కాలంలో పార్టీల నాయకత్వం వ్యక్తిగత ప్రెస్టేజీగా భావిస్తున్నది. రాష్ట్రంలో రాజకీయ మార్పునకు ఉప ఎన్నిక ఫలితం ఎంత దోహదం చేస్తుందో కానీ.. పతాక స్థాయి ప్రచారం చేశారు. పార్టీలు పోటాపోటీగా పాల్గొన్నాయి. కోట్లాది రూపాయలు కుమ్మరించాయి. విజయం సాధించేందుకు సకల శక్తులను మోహరిస్తూ ఒక్క ఉప ఎన్నికను రాష్ట్ర ఎన్నికగా మార్చివేసి చావు బతుకుల సమస్యగా చేశాయి. ఇక విమర్శలు, ప్రతివిమర్శలు, సవాళ్ళు, ప్రతిసవాళ్ళ లక్ష్మణ రేఖ దాటిపోయి పరిస్థితిని జుగుప్సాకరంగా మార్చారు. దీంతో ఉప ఎన్నికలంటేనే కొన్ని పక్షాలు పోటీకి వణికిపోతున్నాయి.

సకల హంగులూ సర్వ శక్తులు



మూడు నెలలపాటు రాష్ట్రాన్ని కుదిపేసిన జూబ్లీ హిల్స్ ఎన్నికల ఫలితాలు ఎట్టకేలకు శుక్రవారం వెలువడ్డాయి. ఎన్నికల ప్రచార ప్రారంభం నుంచి ఈ పార్టీ గెలుస్తోంది ఆ పార్టీ గెలుస్తోందీ. మా పార్టీయే గెలుస్తుందంటూ ఊదరగొట్టిన ప్రచారం. ఊహాగానాలు, రాజకీయ జోస్యాలు, ఆఖరికి సర్వేల పేరుతో సమర్పించిన సొంత నివేదికలు, నాటకాలు, ఫేక్రుచారాలు, సోషల్ మీడియా ఆడంబరాలు, ప్రసార సాధనాల ప్రయోగం, పెయిడ్ న్యూస్ ఒక్కటేమిటీ సకల హంగులు, రంగులను ఈ ఎన్నికల్లో వినియోగించారు. ఈ క్రమంలో కూడా గెలుపోటములు దోబూచులాడుతూ వచ్చాయి. ప్రచారంలో తిట్లు, శాపనార్ధాలు, ఏడ్పులు, కన్నీటి పర్యంతాలు, గొడవలు, ముద్దుగా చెప్పుకునే 'పోల్ మేనేజ్ మెంట్', దొంగ ఓట్లు, అధికార దుర్వినియోగం, లాఠీచార్జీల మధ్య ముగిసిన పోలింగ్ అనంతరం మరోసారి సర్వే ఫలితాల హడావుడి, బెట్టింగులతో రాష్ట్ర రాజకీయం నిన్నటి వరకు వేడెక్కించారు. తాజాగా శుక్రవారం ఉదయం నుంచి ప్రారంమైన ఎన్నికల ఫలితాలు తీవ్ర ఉత్కంఠను రేపినప్పటికీ రౌండ్ వారీగా తొలి నుంచి కాంగ్రెస్ ఆధిక్యాన్ని చాటిచెప్పి దాదాపు 25వేల మెజార్టీతో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందారు. భర్త అకాల మృతితో అనివార్యంగా బరిలో నిలిచి, గెలుపు తమదేనని భావించిన బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు సానుభూతి పట్టం కట్టలేదు. జూబ్లీ ఎన్నికల్లో విజయం తమదేనంటూ పోటీలో నిలిచిన బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డికి డిపాజిట్ గల్లంతయ్యింది.

# జహీరాబాద్‌లో వరుస ఏసీబీ దాడులు.. అవినీతి అధికారుల గుండెల్లో గుబులు

జహీరాబాద్, నవంబర్ 15: జహీరాబాద్ నియోజకవర్గంలో ఏసీబీ అధికారుల దాడులు కలకలం రేపుతున్నాయి. చిరుద్యోగులే కాదు పెద్దస్థాయిలో ఉన్న అధికారులను సైతం వదలనంటోంది ఏసీబీ. ఉన్నతాధికారి అయినా.. సామాన్య ఉద్యోగి అయినా అవినీతికి పాల్పడితే అంతే సంగతులంటూ చేతల్లో చూపిస్తోంది. అవినీతి అధికారుల విషయంలో ఏసీబీ దూకుడుతో సరికొత్త గుబులు స్టార్ట్ అయింది. గత ఐదు నెలల్లోనే ఐదుగురు అధికారులు ఏసీబీకి పట్టుబడడం చర్చనీయాంశంగా మారింది. వరుస ఘటనలతో జిల్లా అధికారుల్లో కలవరం మొదలైంది. ఇటీవల కాలంలో ఏసీబీ అధికారులు అవినీతికి పాల్పడుతున్న వారిని పట్టుకునే విషయంలో దూకుడు పెంచినట్టుగా స్పష్టం అవుతోంది. రెడ్ హ్యాండెడ్‌గా దొరికితే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు మధ్యవర్తుల ద్వారా లంచం తీసుకుంటున్న ఘటనలు కూడా వదిలిపెట్టడం లేదు. మధ్యవర్తిత్వం చేసిన వారికి బాధితులకు ఎలాంటి సంబంధాలు లేకపోవడంతో పాటు అవినీతికి పాల్పడే అధికార యంత్రాంగం ఎంచుకున్న సరికొత్త మార్గాన్ని కూడా ట్రేస్ చేస్తున్నారు. దీంతో మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న వారు కూడా ఏసీబీ కేసుల్లో ఇరుక్కోక తప్పడం లేదు.అధికారులకు వంత పాడేందుకు ప్రయత్నిస్తే ప్రైవేటు వ్యక్తులు అయినా సరే చట్టాలకు పనిచెప్పి తీరుతామని అంటున్నారు ఏసీబీ అధికారులు. గత జూలైలో నిమ్జ్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న బాధిత రైతుడి కి పరిహారం చెక్కు చెల్లింపు విషయంలో ముడుపులు తీసుకుంటూ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ తాసిల్దార్, ఆర్డీవో కారు డ్రైవర్‌ను ఏసీబీ పట్టుకున్నారు. అక్టోబర్‌లో మొగుడంపల్లి మండల పరిధిలోని మాడిగి గ్రామ శివారులోని ఆర్టీఏ చెక్‌పోస్టుపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. పార్టీ అధికారులు ప్రైవేట్ వ్యక్తులను నియమించుకొని వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు చేసి పట్టుకున్నారు.తాజాగా ఏసీబీ డీజీ ఆదేశాల మేరకు శుక్రవారం జహీరాబాద్ పట్టణ సమీపంలోని రంజోల్ గ్రామ శివారులోని సబ్ రిజిస్టర్ కార్యాలయంపై అధికారులు దాడులు చేశారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో కొనుగోలుదారుడు అమ్మకం దారుడు మాత్రమే ఉండాల్సి ఉన్నప్పటికీ, ఇతర వ్యక్తులు ఉండకూడదని నిబంధన ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రహించి ప్రైవేట్ వ్యక్తుల నుంచి రూ.42,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే స్థానిక సబ్ రిజిస్ట్రార్ పరంజ్యోతి ఇంటిపై ఏసీబీ అధికారులు దాడి చేసి



నగదు, ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. 2024లో నిమ్జ్ పరిహారం చెక్కుకు సంబంధించి న్యాల్కల్ ఆర్ఐ బాధితులు నుంచి డబ్బులు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే.

అధికారుల్లో ఆందోళన..

అవినీతి అధికారులను టార్గెట్ చేస్తూ ఏసీబీ నిఘా పెంచడంతో అధికారుల్లో ఆందోళన కలుగుతోంది. ఏసీబీ అధికారుల వరుసదాడులు జరుగుతున్నట్లు ప్రచారం నెలకొనడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏసీబీ అధికారుల దాడులతో ఒక్కసారిగా ఉలిక్కి పడుతున్నారు. జహీరాబాద్ నియోజవర్గంలో నిమ్జ్ ప్రాజెక్టు కార్యాలయంతో పాటు సబ్ రిజిస్ట్రేషన్, రవాణా శాఖల్లో ఏసీబీ సోదాలు జరగడం, ఐదుగురు అధికారులు పట్టుబడడంతో అవినీతి అధికారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఇటీవల ఏసీబీ అధికారులు ముమ్మరంగా దాడులు చేస్తుండడం అవినీతి అధికారుల్లో దడ పుట్టిస్తుందనే విషయంలో సందేహం లేదు. అవినీతి ఎక్కువ ఉందని భావిస్తున్న శాఖల్లో రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ శాఖ, పోలీస్, రిజిస్ట్రేషన్, ఆర్టీఏ, అటవీ, హెల్త్, వ్యవసాయ శాఖలు ముందున్నయని చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఏసీబీ వరుస దాడులతో ఉద్యోగులు అప్రమత్తమయ్యారు. ఈరోజు ఎక్కడ, ఏ ప్రాంతం, ఏ శాఖ నుంచి ఏసీబీ అధికారులకు ట్రాప్ అయినట్లు వినవలసి వస్తుందోనని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

# బీఆర్ఎస్ ఎక్కడ బోల్తా కొట్టింది... రేవంత్ ను కెలికితే కష్టాలు తప్పవా?



హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపై విస్తృత చర్చ జరుగుతోంది. వరుసగా రెండు ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్.. ఉప ఎన్నికల్లో సిటింగ్ స్థానాన్ని కాపాడుకోలేని దయనీయస్థితికి ఎందుకు చేరుకుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇది ఆ పార్టీ స్వయంకృతమా? అనే చర్చకు కారణమవుతోంది. సానుభూతితో సొంతం చేసుకోవాల్సిన స్థానంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రెచ్చగొట్టడం ద్వారా చేజేతులా ఓటమిమి మూటగట్టుకోవాల్సి వచ్చిందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. జూబ్లీహిల్స్ ఎన్నిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరుకు రెఫరెండంగా ప్రకటించడమే కాకుండా, ఈ ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం నుంచి దిగిపోవాల్సివస్తుందన్న ప్రచారం చేయడంతోనే బీఆర్ఎస్ ఎక్కువ నష్టపోయినట్లు వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.తాజా ఓటమితో సమీప భవిష్యత్తులో బీఆర్ఎస్ కోలుకునే పరిస్థితి ఉందా? అన్న చర్చ కూడా జరుగుతోంది. కొద్ది రోజుల్లో జరిగే స్థానిక ఎన్నికలు, జీహెచ్ఎంసీ పోల్ కూడా బీఆర్ఎస్ కు సవాల్ గా మారే అవకాశం ఉందంటున్నారు. 2023 ఎన్నికల్లో అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ ఇంతవరకు మళ్లీ గెలవలేదు. సరికదా.. చేతిలో ఉన్న రెండు స్థానాలను కాంగ్రెస్ పార్టీకి అప్పజెప్పాల్సిన పరిస్థితులను తెచ్చుకుందని అంటున్నారు. దీనికి కారణం బీఆర్ఎస్ హైకమాండ్ వ్యవహరించిన తీరే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గౌరవించే విషయంలో బీఆర్ఎస్ జీర్ణించుకోలేని విధంగా నడుచుకుంటోందని, దీంతో సీఎం రేవంత్ రెడ్డిని రెచ్చగొట్టేలా.. కసితో పనిచేసేలా చేస్తోందని అంటున్నారు.నిజానికి బీఆర్ఎస్ సున్నితంగా వ్యవహరిస్తే జూబ్లీహిల్స్ ఎన్నికకు ఇంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉండేది కాదంటున్నారు. బీఆర్ఎస్ నేత మాగంటి గోపీనాథ్ మరణంతో ఖాళీ అయిన స్థానాన్ని రాజకీయం చేయకుండా సావదానంగా సంప్రదింపులు జరిపితే కాంగ్రెస్ పార్టీ కూడా పట్టించుకోకుండా వదిలేసేదని, కానీ, గోపీనాథ్ మరణించిన నుంచి జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతామన్నట్లు బీఆర్ఎస్ పెద్దలు నడుచుకోవడంతోనే తగిన మూల్యం చెల్లించుకోవాల్సివచ్చిందని అంటున్నారు. ఎన్నికలకు చాలా రోజుల ముందే ప్రచారం ప్రారంభించిన బీఆర్ఎస్ చివరి రోజుకు వచ్చేసరికి అలసిపోవడం కూడా ఓటమికి కారణంగా చెబుతున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్ ప్రస్తుత దుస్థితికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కారణమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డిని రెచ్చగొట్టడం ద్వారా గులాబీ దళం మళ్లీ మళ్లీ ఎదురుదెబ్బలు తినాల్సివస్తోందని అంటున్నారు. సాధారణ ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్ రెడ్డిని కెలికి అరెస్టు చేయంచడం దగ్గర నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రతి పరిణామంలోనూ రేవంత్ రెడ్డి ఎదుగుదలకు బీఆర్ఎస్ అధిష్టానం పాత్ర స్పష్టంగా కనిపిస్తుందని చెబుతున్నారు. తాజా ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పోటీ చేస్తున్నారనే భావన కల్పించి బీఆర్ఎస్ తన గొయ్యి తానే తవ్వుకుందని అంటున్నారు. పదే పదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కెలికి.. ఆయన గల్లీగల్లీలా తిరిగేలా చేసిందని, దీనివల్ల జూబ్లీహిల్స్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం.. తన పవర్ చూపించారని అంటున్నారు.

# ఉగ్ర లింకు.. ఆ నలుగురు డాక్టర్ల రిజిస్ట్రేషన్ రద్దు



న్యూఢిల్లీ: ఎర్రకోట సమీపంలో సూసైడ్ బాంబింగ్ నిందితుడు డాక్టర్ ఉమర్-ఉన్-నబీ అలియాస్ ఉమర్ మహ్మద్‌కు చెందిన పుల్వామాలోని అతని ఇంటిని భద్రతా బలగాలు బాంబులతో పేల్చేశాయి. ఇదే కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకున్నది. ఉగ్రవాద మాడ్యూల్‌తో సంబంధం ఉన్న నలుగురు డాక్టర్లపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ చర్యలు తీసుకున్నది. వారి రిజిస్ట్రేషన్లను రద్దు చేసింది. దేశంలో ఎక్కడా వైద్య వృత్తిని నిర్వహించకుండా ఎన్ఎంసీ నిషేధం విధించింది. ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్‌లు నమోదవడం, జమ్ముకశ్మీర్ పోలీసుల నుంచి అందిన సమాచారం, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సమర్పించిన నివేదికలను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నది. డాక్టర్ ముజాఫర్ అహ్మద్, డాక్టర్ అదీల్ అహ్మద్ రాదర్, డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ షాహీన్ సయీద్‌ల ఇండియన్ మెడికల్ రిజిస్ట్రీ , నేషనల్ మెడికల్ రిజిస్ట్రీ లోని రిజిస్ట్రేషన్‌ను వచ్చేలా రద్దు చేసినట్లు ప్రకటించింది. ఇది వెంటనే అమలులోకి వస్తుందని తెలిపింది. వీరికి ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడుతో సంబంధం కలిగి ఉన్నట్లు ఎన్ఎంసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో ఎన్ఎంసీ ఆదేశాల మేరకు ఆయా రాష్ట్రాల మెడికల్ కౌన్సిళ్లు ఈ నలుగురు డాక్టర్ల పేర్లను ఇండియన్, నేషనల్ మెడికల్ రిజిస్టర్లను తొలగించాయి.

# ఆ పేలుడులో ఉగ్ర కోణం లేదు: డీజీపీ నళిన్ ప్రభాత్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని నౌగామ్ పోలీసు స్టేషన్‌లో జరిగిన పేలుడు ఘటన గురించి ఆ రాష్ట్ర డీజీపీ నళిన్ ప్రభాత్ మాట్లాడారు. నౌగామ్ పోలీస్ స్టేషన్ పేలుడు ఘటనలో ఉగ్రవాద కోణం లేదన్నారు. ఇవాళ ఆయన మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ.. నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన %ఖీ×=% 162/2025 కేసులో దర్యాప్తు చేస్తున్న సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఆ కేసులో భాగంగా ఫరీదాబాద్ నుంచి భారీ స్థాయిలో పేలుడు పదార్థాలు, రసాయనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అయితే నౌగామ్ పోలీసు స్టేషన్‌లోని ఓపెన్ ఏరియాలో సురక్షితంగా ఆ పేలుడు పదార్థాలను పెట్టామని, అయితే వాటిని ఫోరెన్సిక్, కెమికల్ ఎగ్జామినేషన్‌కు పంపాల్సి ఉందన్నారు. ఎఫ్ఎస్ఎల్ బృందం రెండు రోజుల నుంచి అదే పనిలో ఉందన్నారు. చాలా సున్నితమైన పదార్థాలు కావడంతో వాటిని ఎఫ్ఎస్ఎల్ టీమ్ జాగ్రత్తగా ప్యాక్ చేస్తోందన్నారు.



కానీ దురదృష్టవశాత్తు శుక్రవారం రాత్రి 11.20 నిమిషాలకు పేలుడు సంభవించినట్లు డీజీపీ నళిన్ ప్రభాత్ తెలిపారు.

# ఒక్క ఎన్నికలో గెలిస్తేనే ఇంత మిడిసిపడితే ఎలా?

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు వచ్చి 24 గంటలు గడవకముందే కాంగ్రెస్ పార్టీ రౌడీయిజం, గుండాయిజం మొదలుపెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తపై జరిగిన దాడిని ఖండించారు. తాము పదేండ్లు అధికారంలో ఉన్నామని, ఎన్నో ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందినా ఎప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ వలే ప్రతిపక్షాలపై దాడులు చేయలేదన్నారు. జూబ్లీహిల్స్ రహమత్‌నగర్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త రాకేశ్‌ను కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కార్యకర్తలు ఎవ్వరూ దిగులు చెందొద్దని, కాంగ్రెస్ చేస్తున్న రౌడీయిజాన్ని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని ప్రతి కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. ఆపదొస్తే అన్ని వేళల్లో అండగా ఉంటాని తెలిపారు. తమ కార్యకర్తపై జరిగిన దాడికి కాంగ్రెస్ బాధ్యత తీసుకోవాలన్నారు.దొంగ ఓట్లు, గూండా గిరి చేసి, డబ్బులు పంచి జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని చెప్పారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తమకు గతంలో 80 వేలు ఓట్లు వస్తే ఈ ఉప ఎన్నికలో 75 వేల ఓట్లు వచ్చాయని, ఇన్ని కుట్రలు, రిగ్గింగ్ చేసినా మా ఓట్లు కేవలం 5 వేలు మాత్రమే తగ్గాయన్నారు. కచ్చితంగా భవిష్యత్తులో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేసి తీరుతామని స్పష్టం చేశారు.తాను అహంకారం తగ్గించుకోవాలన్న రెవంత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ..



శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ చేసిన విజయోత్సవ ఊరేగింపుతోనే ఎవరిది అహంకారమో తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. గతంలో మేము అనేక ఉప ఎన్నికలు గెలిచాము, కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదు. అందుకని ఆ పార్టీ గుర్తును గాడిద మీద వేసి ఊరేగించామా అని ప్రశ్నించారు. ఒక్క ఉప ఎన్నిక గెలిచినందుకే ఇంత ఎగిరి పడడం అవసరం లేదని చురకలంటించారు. ఎవరిది అహంకారమో ప్రజలు నిర్ణయిస్తారన్నారు. జూబ్లీహిల్స్ నేతలు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించానున్నామని చెప్పారు. కాంగ్రెస్ గుండాయిజం మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

## సంపాదకీయం

ఆదివారం 16-11-2025

### బీహార్ ఫలితాలు రాహుల్‌కు గట్టి గుణపాఠం!

బీహార్ ఎన్నికల ఫలితాలు మొత్తం కేవలం మోడీ, అమిత్ షాల వ్యూహంలోనే నడిచాయి. వారిద్దరే ప్రధాన ప్రచారకులుగా ముందుండి నడిచారు. నితీశ్ కుమార్‌ను ముందు నిలబెట్టి యుద్ధం చేసింది ఈ ఇద్దరే అని చెప్పడంలో సందేహం లేదు. నిజానికి బిజెపికి పూర్తి మెజార్టీ వచ్చే అవకాశం ఉన్నా, నితీశ్‌ను వదులు కోరాదన్న నిర్ణయంతో ముందుకు సాగిన తీరు చూస్తే..బిజెపి వ్యూహం అర్థం చేసుకోవచ్చు. అన్నింటికి మించి సర్ తో లాపతా లేని ఓటర్లను తొలగించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం కూడా బిజెపిదే. బీహార్‌లో చొరబాటుదారులు ఓటర్లుగా మారి శాసించే స్థాయికి వచ్చారు. ఇది బెంగాల్, బీహార్‌ల్లోనే ఎక్కువ శాతంగా ఉంది. దీనిని బిజెపి బాగా అధ్యయనం చేసింది. ఇలా దేశంలో తిష్టవేసిన చొరబాటుదారులు బీహార్‌లో, బెంగాల్లో ఉండకుండా చేసేందుకు పక్కా ప్రణాళిక రచించి సాహసోపేతంగా ఓటర్ల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. నిజానికి రాహుల్ దీనిని స్వాగతించి ఉంటే ఆయన ప్రతిష్ట పెరిగేది. కానీ అలా చేయకపోవడం వల్ల ఆయన పట్ల ప్రజల్లో కూడా వ్యతిరేకత వచ్చింది. ఓట్ల తొలగింపు వ్యవహారాన్ని ఓట్ చోరీ పేరుతో రాహుల్ చేసిన యాగీ అంతాఇంతా కాదు. పక్క ఇంట్లో దొంగ ఓట్లు ఉన్నాయని తెలిసినా ఏమీ చేయలేని ప్రజలు ఎన్నికల సంఘం వాటిని తొలగిస్తే స్వాగతించారు. అలాగే వాటి తొలగింపును వ్యతిరేకించిన రాహుల్‌ను తిరస్కరించారు. చోరీ ఓట్ల గురించి సుప్రీంలో కేసు వేశారు. తొలగించిన వారిలో ఒక్కరు కూడా తమ ఓటు పోయిందని అఫిడవిట్ దాఖలు చేసినా సమీక్షిస్తామని సుప్రీం తెలిపింది. అలా ఓట్లు పోయినవారితో అఫిడవిట్ వేయాలని రాహుల్‌కు సుప్రీంకోర్టు సూచించినా..ఆ పని చేయలేకపోయారు. ఎందుకంటే తొలగించిన ఓట్లలో ఉన్నవారంతా చనిపోయినవారు, లేదా బీహార్ వదిలి వెళ్లిన వారు లేదా దొంగతనంగా ఓటర్లుగా చేరిన వారని తేలిపోయింది. అందుకే రాహుల్ ఓట్ చోరీ ప్రచారం ఫలించలేదు. రాహుల్‌తో ఘట్‌బంధన్ పెట్టుకున్న తేజస్వీ యాదవ్ కూడా నిండా మునిగారు. ఓ రకంగా చెప్పాలంటే కాంగ్రెస్‌ది ధృతరాష్ట్ర కౌగిలి. దానిలో ఎవరు కూడా ఇమడలేదు. వంశపారంపర్య పార్టీగా అనేక సార్లు అధికారం వెలగబెట్టింది. తమ పాలనలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై మాట్లాడకుండా బిజెపిని ఎండగడుతూ పోవడం కూడా కాంగ్రెస్‌కు, దాని వెంట ఉన్న పార్టీలను దెబ్బ కొట్టింది. బాగా లోతుగా విశ్లేషిస్తే...ఆపరేషన్ సిందూర్, సర్జికల్ స్ట్రయిక్స్, ఓటర్ల సవరణ వంటి కీలక అంశాలన్నింటినీ ఏదో రకంగా కాంగ్రెస్ వ్యతిరేకంచడమో లేదా తిరస్కరించడమో జరిగింది. బీహార్ రెండోదశ ఎన్నికలకు ముందు ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపైనా కాంగ్రెస్ విమర్శలు చేసింది. ఇది నిఘా వైఫల్యం అని విమర్శించింది. నిజానికి అంతకుముందే భారీ ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిని ప్రస్తుతించలేకపోయారు. ఎవరు అధికారంలో ఉన్నా నిఘా అన్నది కొనసాగుతుంది. కానీ ఇవేవీ తెలియ కుండా బురదజలలే రాజకీయాలను రాహుల్ ముందుకు తీసుకుని వచ్చారు. ఇదికూడా ప్రజల ఆగ్రహానికి కారణమయ్యింది. అందుకే బీహార్‌లో ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్‌కు ఘోర పరాభవం ఎదురైంది. అధికార జేడీ(యూ), బీజేపీ పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమిని దించి ఈసారి ఎలాగైనా అధికారం చేపడదా మని కలలు కన్న కాంగ్రెస్, ఆర్జేడీకి బీహార్ ఓటర్లు గట్టి షాకిచ్చారనే చెప్పాలి. ఎంతగా అంటే మళ్లీ మాట్లాడ కుండా కోలుకోలేని షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేల్చిన హైడ్రోజన్ బాంబు బీహార్‌లో పనిచేయలేదు. బీహార్‌లో సమగ్ర ఓటర్ల జాబితాల సవరణను వ్యతిరేకిస్తూ జరిపిన 'ఓట్ అధికార్ యాత్ర' పెద్దగా ప్రభావం చూపలేదు. బీహారీలు మళ్లీ ఎన్డీయేకే జై కొట్టారు. ఎన్‌డిఏ కూటమి ఆధిక్యంలో మ్యాజిక్ ఫిగర్ 122ను దాటి 191 స్థానాల్లో జోరు ప్రదర్శించడం ఆషామాషీ వ్యవహారం కాదు. ఈ ఎన్నికల్లో తమదే విజయం అంటూ చెప్పుకున్న ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్.. ఫలితాల్లో హాఫ్ సెంచరీని కూడా చేరుకోలేక పోవడం గమనార్హం. 2020 ఎన్నికల్లో ప్రతిపక్షపార్టీ ఏకంగా 114 స్థానాల్లో గెలుపొందింది. ఈ ఎన్నికల్లో అందులో సగం స్థానాలను కూడా దక్కించుకోలేక పోవడం గమనార్హం. ఇవన్నీ కూడా కాంగ్రెస్, రాహుల్ అనుసరించిన జాతి వ్యతిరేక చర్యలుగా ప్రజలు భావించారు. దేశంలో కొత్తనీరు వస్తోంది. వారంతా దేశం ఏ దిశగా పయనిస్తుందో చూస్తున్నారు. ప్రపంచ దేశాలతో పోల్చి చూస్తున్నారు. ఈ సమయంలో మోడీతో రాహుల్‌ను పోల్చుకున్నప్పుడు వారు తప్పకుండా మోడీవైపు ఉన్నారు. అలాగే లాలూ పరిపాలనా కాలాన్ని, నితీశ్ వ్యవహార శైలిని కూడా గమనిస్తూ వచ్చారు. బీహార్‌లో గత రెండు దశాబ్దాలుగా నితీశ్ కుమార్ ఏకఛత్రాధిపత్యం సాగిస్తున్నారు. ఏ కూటమి అధికారంలోకి వచ్చినా ముఖ్యమంత్రి స్థానంలో మాత్రం నితీశ్ కొనసాగుతున్నారు. 2014-2015లో ఒక ఏడాది మినహా గత 20 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి కుర్చీ నుంచి నితీశ్ తప్పుకోవడం లేదు. ఎన్నికల్లో ఏ పార్టీకి ఎక్కువ స్థానాలు వచ్చినా, ఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసినా నితీశ్ మాత్రం సీఎంగానే కొనసాగుతున్నారు. అయితే ఈసారి నితీశ్ పార్టీ గెలుపు కష్టమని చాలా మంది అంచనా వేశారు. వయస్సు అయిపోయిందన్నారు.. ఈసారి కష్టం అన్నారు. అయినా నితీశ్ మాత్రం ఎన్‌డిఏ ఛత్రం కింద అయితినే విజయం సాధ్యమని నమ్ముకున్నారు. ఎన్నో కలుమత రాజీకాలతో నిండిన బీహార్ రాజకీయాల్లో నితీశ్ తిరుగులేని నేతగా నిలిచారు. సాధారణ కుర్మీ కుటుంబంలో జన్మించిన నితీశ్, చిన్నప్పుడు రాజకీయాలకు చాలా దూరంగా ఉన్నారు. అయితే 1970ల చివర్లో జేపీ ఉద్యమంతో ప్రజా జీవనంలోకి అడుగుపెట్టిన నితీశ్ రాజకీయ ప్రయాణం ఓ విజయగాథగా మారింది. నితీశ్ ఎదుగుదల ఒక్కరోజులో జరగలేదు. నిశ్శబ్దం, పట్టుదల, కష్టపడి పనిచేయడం.. ఇవే ఆయన్ని ముందుకు నడిపించాయి. పాత వారిని వదులుకోవడం, కొత్త కూటములు కట్టడం, మళ్లీ పాత వాటిలోకి తిరిగి పోవడం.. నితీశ్ నిర్ణయాలు ఎప్పుడూ ధైర్యంగా, ఊహించని విధంగా సాగాయి. ఎప్పుడు ఏ కూటమిలోకి వెళ్లాలి, ఏ సమయంలో ఏ కూటమి నుంచి బయటికి రావాలి అనేది నితీష్ కుమార్ బాగా అధ్యయనం చేశారని చెప్పొచ్చు. అందుకే ఎన్‌డిఏలో ఉండడం, వెళ్లిపోవడం జరిగింది. ఎలాంటి నిర్ణయం తీసుకున్నా నితీశ్ అడుగు ముందుకే పడింది. బీహార్ వాసుల జీవితాలను కొంతమేరకు అయినా మెరుగు పరిచిన నాయకుడిగా నితీశ్ మన్ననలు అందుకున్నారు. రాష్ట్రంలో వైద్య, విద్య ప్రమాణాలను మెరుగు పరిచారని పేరు సంపాదించారు. లాలూ హయాంలో మొత్తం కుటుంబపాలన సాగింది. లాలూ లేదంటే రబ్రీ కాదంటే ఇప్పుడు తేజస్వీ వచ్చారు. కాంగ్రెస్‌లో కూడా అదే కనిపిస్తోంది. ఇవన్నీ కూడా బిజెపి బాగా అధ్యయనం చేసి ప్రచారం చేసింది. తగిన వ్యూహం పన్నింది. అందుకే గతం కన్నా మిన్నగా బిజెపి సీట్లను గెలుచుకోగలిగింది. తనకు తిరుగులేదని చాటింది. అన్నింటికి మించి బిజెపి దేశం కోసం పనిచేస్తుందని, కుటుంబ రాజకీయాలను ప్రోత్సహించదని రుజువు చేసుకుంది. రాహుల్ ఈ ఫలితాలతో అయినా తన వ్యూహం మారిస్తే మంచిది. ఇకపోతే వ్యూహకర్తగా పేరున్న ప్రశాంత్ కిశోర్ తానే రంగంలోకి దిగి దెబ్బ తిన్నారు. ప్రశాంత్ కిశోర్‌కు వ్యూహాలే తప్ప అమలు చేసేందుకు తగిన ముఖపరిచయం లేదు. అందుకే ఎన్నికల వ్యూహం బెడిసి కొట్టింది.

# గాజాపై అమెరికా కొత్త ఎత్తుగడ



వాషింగ్టన్:పాలస్తీనాను ఇప్పటికే 150 దేశాల వరకు గుర్తించాయి. అటువంటి పరిస్థితులలో ఆ సమస్య పరిష్కారం కావాలనే ఆలోచన ట్రంప్‌కు నిజంగా ఉన్నట్లుయితే చేయవలసింది గాజా నుంచి, వెస్ట్‌బ్యాంక్ నుంచి ఇజ్రాయెల్ తన సేనలను, ఇతర ఆక్రమణలను, వేలాదిమంది అక్రమ సెటిలర్లను వెంటనే నిష్క్రమించేట్లు చేయటం. తర్వాత, ఇజ్రాయెల్ గుర్తించినా లేకున్నా తాము పాలస్తీనాను గుర్తించటం. ఆ తర్వాత ఐక్యరాజ్య సమితిలో అవసరమైన చర్యలు తీసుకోవటం. ఇది జరిగితే సమస్య ఆ గంటలోనే పరిష్కారమవుతుంది. పాలస్తీనా ప్రజలతో పాటు ప్రపంచం కోరుతున్నది అదే. గాజా, వెస్ట్‌బ్యాంక్ పునర్నిర్మాణాలు, అభివృద్ధి క్రమంగా జరుగుతాయి. అందుకు సహాయ పడేందుకు అనేక దేశాలు సిద్ధంగా ఉన్నాయి.గాజాపై 75 సంవత్సరాల ఇజ్రాయెల్ ఆక్రమణ 'సంతృప్తికరంగా' సాగటం లేదని, సమస్యలు ఎదురవుతున్నాయని భావించి కావచ్చు ఇపుడు తానే నేరుగా రంగప్రవేశం చేయాలని అమెరికా ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తున్నది. ఇజ్రాయెల్ ఆక్రమణను స్థానిక పాలస్తీనా ప్రజలు తీవ్రంగా, సాయుధంగా, మునుపెన్నడూ లేని స్థాయిలో ప్రతిఘటిస్తుండగా, అమెరికా తోడ్పాటుతో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమాన్ని ప్రపంచం అంతే తీవ్రంగా ఖండిస్తున్నది. అమెరికా మిత్ర దేశాలు సైతం అందుకు గొంతు కలుపుతూ పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించటం మొదలుపెట్టాయి. మరొక వైపు ఐక్యరాజ్యసమితి, భద్రతా సమితి, అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ నేర న్యాయస్థానం, మానవహక్కుల సంస్థలు ఇజ్రాయెల్ వ్యతిరేక వైఖరిని స్పష్టంగా తీసుకుంటున్నాయి. వీటన్నింటి ఫలితంగా ఇజ్రాయెల్ దాదాపు ఏ కాకిగా మారింది. ఇజ్రాయెల్ ఆక్రమణ 'సంతృప్తికరంగా' లేదని అమెరికా భావించటానికి ఇవన్నీ కారణాలు.ఇటువంటి పరిస్థితుల వల్లనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవలి వారాలలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ పట్ల కొంత కఠినంగా వ్యవహరిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఖతార్‌పై దాడికి ఆగ్రహించిన ట్రంప్, అందుకు నెతన్యాహూ చేత ఖతార్ ప్రధానికి క్షమాపణలు చెప్పించటాన్ని ఇందుకు ఒక ఉదాహరణగా చెప్తున్నారు. అయితే, నెతన్యాహూ చర్యల మూలంగా ఆ ప్రాంతంలో తమ ప్రయోజనాలను అమెరికా కోల్పోబోదు. నెతన్యాహూ తాత్కాలికం. తమ ప్రయోజనాల దీర్ఘకాలికం. ఆ ప్రయోజనాల కోసమే పాశ్చాత్య దేశాలు ఇజ్రాయెల్‌ను సృష్టించాయి. అందు కోసమే ఇతరత్రా ఎన్ని సమస్యలు ఎదురైనా ఇజ్రాయెల్‌ను కాపాడుతూ వస్తున్నాయి. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు ఆటంకాలు సృష్టిస్తూ వస్తున్నది కూడా అందుకోసమే. కనుక, ఇజ్రాయెల్ అనే ఒక సాధనం వల్ల సమస్యలు మొదలైనపుడు కొత్త సాధనాలను తయారు చేసుకోవాలి. ట్రంప్ అదే చేస్తున్నట్లు కనిపిస్తున్నది.ఆ మేరకు ఆయన ఒక ప్రతిపాదన తయారు చేసి భద్రతా సమితి సభ్యదేశాలు కొన్నింటికి మాత్రం పంపారు. ఆ పత్రం ఇపుడు వెలుగులోకి వచ్చింది. దాని ప్రకారం, గాజా నియంత్రణ, పరిపాలన కోసం ఒక అంతర్జాతీయ సైనిక దళం ఏర్పడి, అది ట్రంప్ అధ్యక్షతన ఏర్పడే 'బోర్డ్ ఆఫ్ పీస్' నిర్దేశాల ప్రకారం పని చేస్తుంది. ఆ దళం ఏమిటి, బోర్డు ఏమిటనే వివరాలలోకి వెళ్లేముందు కొన్ని విషయాలు చెప్పుకోవాలి. పాలస్తీనా ప్రజలు, ప్రపంచ దేశాలు కోరుతున్నది గాజా, వెస్ట బ్యాంక్‌లతో కూడిన స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటు. దానితో పాటు ఇజ్రాయెల్ మరొక దేశం కావటం. అక్కడ పోరాటాలు 75 సంవత్సరాలుగా అందుకోసమే సాగుతున్నాయి. అందుకు ఏకైక ఆటంకం ఇజ్రాయెల్, అమెరికాలు. పాలస్తీనాను ఇప్పటికే 150 దేశాల వరకు గుర్తించాయి. అటువంటి పరిస్థితులలో ఆ సమస్య పరిష్కారం కావాలనే ఆలోచన ట్రంప్‌కు నిజంగా ఉన్నట్లుయితే చేయవలసింది గాజా నుంచి, వెస్ట్‌బ్యాంక్ నుంచి ఇజ్రాయెల్ తన సేనలను, ఇతర ఆక్రమణలను, వేలాదిమంది అక్రమ సెటిలర్లను వెంటనే నిష్క్రమించేట్లు చేయటం. తర్వాత, ఇజ్రాయెల్ గుర్తించినా లేకున్నా తాము పాలస్తీనాను గుర్తించటం. ఆ తర్వాత ఐక్యరాజ్య సమితిలో అవసరమైన చర్యలు తీసుకోవటం. ఇది జరిగితే సమస్య ఆ గంటలోనే పరిష్కారమవుతుంది. పాలస్తీనా ప్రజలతో పాటు ప్రపంచం కోరుతున్నది అదే. గాజా, వెస్ట్‌బ్యాంక్ పునర్నిర్మాణాలు, అభివృద్ధి క్రమంగా జరుగుతాయి. అందుకు సహాయ పడేందుకు అనేక దేశాలు సిద్ధంగా ఉన్నాయి.కాని అమెరికా అధ్యక్షుడు ఈ సూటి మార్గాన్ని అనుసరించే బదులు నిజాయితీలేని సరికొత్త ఎత్తుగడలు అనేకం వేస్తున్నారు. ట్రంప్ కన్నా ముందు కాలపు అధ్యక్షులు స్థూలంగా అనుసరించినవే అవన్నీ. ట్రంప్ విషయానికి వచ్చే సరికి, ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారి అయినందున ఒక కొత్త పథకం గురించి మాట్లాడటం తెలిసిందే. అది, గాజా నుంచి పాలస్తీనియన్లను పూర్తిగా ఖాళీ చేయించి అక్కడ రిసార్ట్ ఒకటి అభివృద్ధి పరచటం. దానిపై తీవ్ర విమర్శలు రావటంతో కొంత ఊగిసలాడి, మాటలు మార్చి అవే లక్షాల కోసం ఇపుడు ఒక కొత్త నమూనాను ప్రతిపాదించారు. దాని ప్రకారం, ఇజ్రాయెల్ దశల వారీగా ఉపసంహరించుకోగా హమాస్ వెంటనే అస్త్ర సన్యాసం చేస్తుంది. రాజకీయాలలో, పాలనలో ఎంత మాత్రం పాల్గొనదు. దాని ఆయుధ కర్మాగారాలను, టన్నెళ్లను పూర్తిగా ధ్వంసం చేస్తారు. అమెరికా ఎంపిక చేసే అంతర్జాతీయ వ్యక్తులతోపాటు రాజకీయాలతో సంబంధం లేని పాలస్తీనియన్లతో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడుతుంది. అంతర్జాతీయ దళాలతో తాత్కాలిక సైనిక దళం ఏర్పడుతుంది. గాజాలో ఎటువంటి అభివృద్ధి ఎట్లా జరగాలో ట్రంప్ బోర్డు నిర్ణయిస్తుంది. ఆ ఏర్పాటు ఎన్నేళ్లు ఉండాలో వారే నిర్ణయిస్తారు. దీనంతటిలో వెస్ట్ బ్యాంక్ ప్రస్తావన, భవిష్యత్తు ఏమిటో మాత్రం ఏమీ చెప్పరు. అక్కడి పాలస్తీనా అథారిటీ పాత్ర ఉండదు. ఇక చివరిగా, పాలస్తీనా దేశం ప్రస్తావన అత్యంత అస్పష్టంగా మాత్రమే, ఒక కాలవ్యవధి అంటూ ఏమీ లేకుండా ఉంటుంది. మరొక వైపు, ఇజ్రాయెల్ సేనల పూర్తి ఉపసంహరణ మాట కూడా కన్పించదు. మరొక వైపు నెతన్యాహూ, తాము పూర్తిగా ఉపసంహరించుకోబోమని తమ పార్లమెంటులో ఇప్పటికే ప్రకటించారు. అందుకు ట్రంప్ కాదనలేదు.దీనంతటి సారాంశం ఏమిటో అర్థమవుతున్నదే గనుక మళ్లీ చెప్పనక్కరలేదు. ట్రంప్ వేసిన మొదటి పథకంపై కూడా తీవ్ర విమర్శలు వచ్చాయి. దానితో ఆయన రచించిన తాజా పథకమే, పైన పేర్కొన్న భద్రతా సమితి తీర్మాన ప్రతిపాదన. విచిత్రం ఏమంటే, అందులోనూ కొత్తదనం ఏమీ లేదు. ముసుగు మాత్రం కొత్తది. కాకపోతే అటువంటి ప్రతిపాదన తాము ప్రైవేటుగా చేసిన దానికన్న భద్రతా సమితి ద్వారా చేయించగలిగితే శంఖులో పోసి తీర్థంగా మార్చినట్లు అవుతుంది. అదిగాక, వివాదాస్పద భూభాగాలను ఏదో ఒక దేశానికో, కొన్ని దేశాలకో తాత్కాలిక పాలన కోసం ఉండేట్లుగా అప్పగించే సంప్రదాయం ఒకటి ఐక్యరాజ్య సమితిలో ఉంది. కనుక, ఆ నిబంధనను సౌకర్యవంతంగా ఉపయోగించుకున్నట్లుయితే, తమను విమర్శించేందుకు ఏమీ ఉండదన్నది ట్రంప్ ఎత్తుగడ. ఇజ్రాయెల్ ఏర్పాటుకు ముందు కూడా ఆ ప్రాంతంపై ఇంగ్లాండ్‌కు ఇటువంటి బాధ్యతనే సమితి ద్వారా అప్పగించారు. కనుక ట్రంప్ ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఆ మాండేట్ ఎంత కాలం సాగేదీ ఎవరూ చెప్పజాలరు. పాలస్తీనా ఏర్పాటు ఏమయేదీ అంతకన్న తెలియదు. మొత్తానికి ఆ విధంగా అమెరికా, ఇజ్రాయెల్ కూటమి నియంత్రణ నిరాటంకంగా నిరవధికంగా సాగుతుందన్న మాట. ఈలోగా హమాస్‌ను ధ్వంసం చేస్తారు. అమెరికా పట్ల ప్రేమ గనుక అరబ్ దేశాలు మొక్కబడిగా తప్ప నోరెత్తవు.ఇపుడిక అమెరికా అధ్యక్షుని తాజా తీర్మానంలోని వివరాలను చూద్దాం. అమెరికాకు, ఆ బృందంలోని ఇతర దేశాలకు గాజాను 2027 చివరి వరకు పాలిస్తూ, భద్రత కూడా కల్పించే అధికారం లభిస్తుంది. ఆ గడువును పొడిగించే అవకాశమూ ఉంటుంది. మొదటి సైనిక దళాలను జనవరి నాటికి పంపుతారు. ఆ దళాలు శాంతిని కేవలం 'పరిరక్షించటం' గాక 'అమలు' పరుస్తాయి. అంటే బలప్రయోగంతో వేర్వేరు దేశాల సైనిక బృందాలు ట్రంప్ అధ్యక్షతన గల బోర్డ్‌తో సంప్రదింపుల ద్వారా నియామకమవుతాయి. ఆ దళాలు గాజాకు ఇజ్రాయెల్‌తో, ఈజిప్టుతో గల సరిహద్దులను కాపలా కాయటంతోపాటు పౌరులకు భద్రత కల్పించటం, ఒక కొత్త పాలస్తీనా పోలీసుకు శిక్షణ ఇవ్వటం చేస్తాయి. గాజాను నిస్సైనికంగా మార్చి, హమాస్ వంటి శక్తులను నిరాయుధం చేసి వాటి సైనిక సంపత్తిని టన్నెల్ నిర్మాణాలను ధ్వంసం చేస్తాయి.

# ఆకలి భారతం!



న్యూఢిల్లీ,భారతదేశం ఇంకా తీవ్ర ఆకలితో ఉన్న దేశాల జాబితాలోనే ఉందని ఐక్య రాజ్యసమితి తాజా నివేదిక వెల్లడించటం- మన పాలకులు చెప్పే గొప్పలను తుత్తునియలు చేస్తోంది. ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక శక్తిగా అవతరించామంటూ మోడీ ప్రభుత్వం మోగిస్తున్న డాంబికాల ఢంకాకు ఆకలి సూచి అందించిన అంకెల సమాచారం పెద్ద చిల్లునే పెట్టింది. ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) లో భాగంగా రూపొందించిన మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపిఐ) ప్రకారం ప్రపంచంలో ఎక్కువమంది ఆకలితో నిద్రపోతున్న ఐదు దేశాల్లో మనదీ ఒకటి. మనదేశంలో 24.3 కోట్ల మంది రోజూ ఆకలితోనో, అర్థాకలితోనో పొద్దుబుచ్చుతున్నట్టు ఐక్యరాజ్య సమితి అధ్యయనంలో తేలింది. ఆకలి విషయంలో పాకిస్తాన్, ఇథియోపియా, నైజీరియా, కాంగో సరసన మన దేశమూ ఉండడం చాలా శోచనీయం. ప్రపంచంలో 110 కోట్ల మంది ఆకలితో అల్లాడుతుంటే- అందులో 40 శాతం మంది ఈ ఐదు దేశాల్లోనే ఉన్నారు.ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ సహకారంతో యుఎన్‌డిపి 127 దేశాల్లో ఈ సర్వేను నిర్వహించింది. ప్రజలకు ఆహారం మెరుగ్గా అందుతున్న దేశాల్లో మనది 102వ స్థానం కావటం ఆందోళనకరం. మనపక్కన ఉన్న శ్రీలంక (61), నేపాల్ (72), బంగ్లాదేశ్ (85) మనకన్నా ముందు స్థానాల్లో ఉన్నాయి. ఇటీవలి కాలంలో తీవ్ర రాజకీయ సంక్షోభాలను ఎదుర్కొన్న ఈ దేశాలు తమ ప్రజలకు తగినంత ఆహారం సమకూర్చటం లో మనకన్నా ముందు పీఠిన నిలవటం గమనార్హం.మనదేశం ఆహార ఉత్పత్తిలో ముందంజలో ఉన్నప్పటికీ- ఆకలి, పోషకాహారలోపం కొనసాగటం అత్యంత అసమతుల్య ఆర్థికాభివృద్ధికి అద్దం పడుతోంది. సంపన్నులు మరింత సంపన్నులు కావటం, పేదలు మరింత పేదలుగా దిగజారటం అసమ అభివృద్ధిలోని తీవ్రమైన దుర్లక్షణం. మనదేశంలో సంపన్నుల అభివృద్ధి పథాలు, వారి కొరకు నిర్మితమయ్యే సౌకర్యాల స్వర్గధామాలు ప్రాచుర్యం పొందినంతగా- సామాన్యుల స్థితిగతులు, పేదల రోజువారీ బతుకు పాట్లు ప్రచారం పొందవు. చర్చలోకి రావు. కానీ, రోజుకు నూట అరవై రూపాయల ఆదాయం కూడా పొందలేని పౌరులు పుష్కలంగా ఉన్న దేశం మనది. ఇండియాలో ఆహార పంపిణీలో తీవ్రమైన అంతరం ఉందని, పేదరికం, పిల్లల్లో పోషకాహార లోపం, పారిశుధ్య లోపం హెచ్చుస్థాయిలో ఉన్నాయని యుఎన్‌డిపి నివేదిక ఎత్తిచూపింది.మనదేశంలో కార్పొరేట్ల అడుగులకు మడుగులొత్తే ప్రజావ్యతిరేక పాలక విధానాలు దారిద్ర్యాన్ని పెంచటానికి కారణమవుతున్నాయి. పిల్లల చదువులకు, కటుంబ సభ్యుల వైద్యావసరాలకు ఉన్న ఆస్తులను, ఆదాయాలను కోల్పోతున్న కుటుంబాలు ఏటేటా పెరుగుతున్నాయని కోవిడ్ కాలం నాటి దుర్భర పరిస్థితి వెల్లడి చేసింది. మౌలికమైన విద్యా వైద్య రంగాల్లో పెనవేసుకుపోయిన ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ సామాన్యుల ఉసురు తీస్తున్నాయి. దేశానికి తిండిని అందించే వ్యవసాయ రంగంలో నిత్యం సంక్షోభం ఆవహించే ఉంటుంది. గిట్టుబాటు ధర లేకపోవటం, మార్కెట్టు సమస్యలు, పెట్టుబడులు ఏటేటా పెరగటం ఆ రంగాన్ని ఆధారంగా చేసుకొని బతుకుతున్న కోట్లాది కుటుంబాలను అతలాకుతలం చేస్తున్నాయి. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ల కేంద్రంగా తప్ప- సామాన్య ప్రజల జీవనావసరాలకు ఆలంబనగా పాలకుల విధానాలు ఉండడం లేదు. ఈరీత్యా పైకి అభివృద్ధి పూనకాలను ప్రచారంలో ఊదరగొడుతున్నా పునాది రంగాలు ఊతం లేక విలవిల్లాడుతున్నాయి.ఈ వాస్తవాలను మరుగున పర్చి, దేశాన్ని ఉద్వేగాలూ, ఉన్మాదాలతో ఊగించటం మోడీ ప్రభుత్వం ఒక వ్యూహంగా సాగిస్తోంది. ఈ ధోరణి ఏ సమస్యనూ పరిష్కరించదు. ప్రపంచంలో 82 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడుతుంటే అందులో 20 కోట్ల మంది మనదేశంలోనే ఉన్నారు. రోజూ పస్తులతో పడుకుంటున్న అన్నార్తుల్లో 24 శాతం మంది మనవాళ్లే! ఆకలి, పోషకాహార లేమి కారణంగా రోజూ 4500 మంది పిల్లలు చనిపోతున్నారు. ఇలాంటి దుస్థితి నుంచి బయటపడాలంటే కార్పొరేట్లను పెంచి పోషించే నయా ఉదార విధానాలకు స్వస్తి చెప్పాలి. దుర్భర దారిద్ర్యాన్ని తరిమి కొట్టటానికి కేరళ వామపక్ష ప్రభుత్వం చేపట్టిన విధానాన్ని అనుసరించాలి. కళ్లు మిరుమిట్లు గొలిపే ఉపాధి రహిత అభివృద్ధి వల్ల ఉపయోగం లేదు. ప్రజల కనీస అవసరాలను తీర్చే సమతుల అభివృద్ధి, స్థిరమైన ఆదాయ కల్పన ఇప్పుడు అత్యవసరం. అప్పుడే ఆకలికి చెల్లుచీటి రాయగలం. చరమగీతం పాడగలం.

## ఎర్రకోట ఘటన వెనక నిప్పులాంటి నిజాలు

న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పేలుడు కేవలం ఒక చిన్న సంఘటన కాదని, దీని వెనుక దేశ వ్యాప్తంగా భారీ ఉగ్ర దాడులకు ప్రణాళిక వేసినట్లు భద్రతా ఏజెన్సీలు గుర్తించాయి. ఈ కుట్రలో వైట్‌కాలర్ ఉగ్రవాదులు పాల్గొన్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. భారీ ఉగ్రదాడి చేసేందుకు.. పేలుడు పదార్థాలు నింపిన 32 కార్లను సిద్ధం చేసేందుకు అనుమానిత ఉగ్రవాదులు ప్లాన్ చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 6న దాడులకు పాల్పడాలని ఉగ్రవాదులు భావించారని విచారణలు తేలింది. అందుకోసమే ఈ 32 కార్లను కూడా సిద్ధం చేసుకున్నారని దర్యాప్తులో తేలింది. ఈ 32 కార్లతో ఢిల్లీతో సహా దేశంలోని పలు నగరాల్లో ఏకకాలంలో దాడుల కోసం ఉపయోగించాలని అనుమానిత ఉగ్రవాదులు భావించినట్లు అధికారులు గుర్తించారు. నిందితులు దాడుల కోసం ఐ20, ఎకోస్పోర్ట్ వంటి కార్లను ఎంపిక చేసుకుని.. వాటిని పేలుడు పదార్థాలను నింపేందుకు వీలుగా మాడిఫై చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సీరియల్ పేలుళ్లకు పాల్పడాలన్నదే వారి ప్రధాన ఉద్దేశమని భద్రతా ఏజెన్సీల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఇప్పటి వరకు నాలుగు కార్లను గుర్తించారు. ఇవన్నీ పాత కార్లుగా తేలాయి. దాడుల కోసం పాత కార్లను ఉగ్రవాదులు కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే బ్రెజ్జా, స్విఫ్ట్, ఎకోస్పోర్ట్ వంటి కార్లను పోలీసులు గుర్తించారు. బ్రెజ్జా కారు హర్యానాలోని ఫరీదాబాద్( ఈజీసతితజీశజీట)లోని అల్-ఫలాహ్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ క్యాంపస్‌లో కనుగొనబడింది. అలానే ఎకోస్పోర్ట్ కారు బుధవారం రాత్రి హర్యానాలోని ఫరీదాబాద్‌లో కనుగొనబడింది. మరోవైపు ఈ 32 కార్ల ద్వారా నాలుగు వేర్వేరు లొకేషన్లలో దాడులకు వినియోగించాలని మొత్తం ఎనిమిది మంది అనుమానిత ఉగ్రవాదులు ప్రణాళిక వేసినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు వెల్లడించారు. ఈ దాడుల కోసం అవసరం అయ్యే పేలుడు పదార్థాల కొనుగోలుకు వైట్‌కాలర్ డాక్టర్లు నిధులు సమకూర్చారని పేర్కొన్నారు. నిందితులు సుమారు రూ. 26 లక్షల నిధిని సేకరించినట్లు సమాచారం. ఈ నిధులను పోగు చేసిన అనుమానితుల్లో డాక్టర్ ముజమ్మిల్ గన్నై, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, డాక్టర్ షహీన్ సయ్యిద్, డాక్టర్ ఉమర్ నబీ ఉన్నారని అధికారులు గుర్తించారు. ఈ నిధులను ఉగ్ర కార్యకలాపాలను నిర్వహించేందుకు ప్రధానంగా డాక్టర్ ఉమర్ నబీ ఉపయోగించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఉన్నత విద్యావంతులు, వైట్‌కాలర్ ఉద్యోగులు ఉగ్ర కుట్రలో భాగం కావడాన్ని కేంద్ర ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి.

## డాక్టర్ షాహీన్ వ్యవహారంపై కుటుంబం ఆశ్చర్యం

న్యూఢిల్లీ,ఢిల్లీ పేలుళ్ల ఘటనకు కారణమైన కీలక నిందితుల్లో ఒకరైన డాక్టర్ షాహీన్ పట్ల ఆమె కుటుంబ సభ్యులు మాట్లాడిన తీరు విస్మయం వ్యక్తం చేస్తోంది. షాహీన్‌కు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే విషయాన్ని నమ్మలేకపోతున్నామని.. కనీసం అలాంటి సంఘటనకు సంబంధించిన ఆనవాళు కూడా తెలియవని ఆమె కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ప్రస్తుతం తాము లక్నోలోని దాలిగంజ్ ప్రాంతంలోని ఓ ఇరుకైన సందులో నివాసముంటున్నామని, తాముండే ప్రాంతానికి ఢిల్లీకి సుమారు 550 కిలోమీటర్ల దూరం ఉంటుందని షాహీన్ తండ్రి సయ్యద్ అహ్మద్ అన్సారీ అన్నారు.ఢిల్లీలో జరిగిన పేలుడు కేసులో షాహీన్‌కు సంబంధముందని, జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రవాద సంస్థతో కలిసి పనిచేస్తోందనే ఆరోపణలపై ఆమె అరెస్ట్ కావడం కలిచివేస్తోందని వాపోయారు. ఎలాంటి అనుమానాలు తమకు లేవని అన్నారు.. ఆమె ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తుందని విని షాక్ తిన్నా. ఇటీవలే అనగా దాదాపు నెల క్రితం నేను ఆమెతో మాట్లాడాను. ఆమె అలహాబాద్‌లో వైద్య విద్య పూర్తి చేసి, ఫరీదాబాద్‌లో పనిచేస్తోందని అన్సారీ తెలిపారు. షాహీన్ సోదరుడు మహమ్మద్ షోయబ్ మాట్లాడుతూ.. 'షాహీన్‌కు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయంటే నమ్మలేకపోతున్నాం. ఆమె ఢిల్లీలో అరెస్టయ్యాక.. ఇటీవల పోలీసులు, భద్రతా దళ సిబ్బంది మా ఇంటికి వచ్చారు. వారు నాతో సహా మా కుటుంబంలో ఎవ్వరినీ ఇబ్బందులకు గురిచేయలేదు. గత నాలుగేళ్లుగా షాహీన్ మాకు దూరంగా ఉంటోంది. కానీ ఆమె పిల్లలతో మా అమ్మానాన్నలు అప్పుడప్పుడూ మాట్లాడుతుండేవారు. లఖ్‌నవూలోని ఐఐఎం రోడ్డులో షాహీన్‌కు ఓ ఇల్లుందని తెలుసు. మేమెప్పుడూ అక్కడికి వెళ్లలేదు. కనీసం అదెక్కడుందో, ఎలా ఉందో కూడా మాకు తెలీదు. మెడిసిన్ చదివేటప్పుడు ఆమె ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడినట్టు కూడా అనిపించలేదు. అలాంటిది ఆమెకు ఉగ్రవాదులతో లింకులు ఉన్నాయంటే ఇప్పటికీ నమ్మలేక పోతున్నాం.' అని వివరించారు. ఢిల్లీ పేలుడు ఘటన తర్వాత కాన్పూర్‌లో ఆప్తమాలజిస్ట్‌గా పనిచేస్తున్న షాహీన్ మాజీ భర్త డా.జాఫర్ హయత్‌ను పోలీసులు విచారించారు. 'షాహీన్ అరెస్టైన విషయం నాకూ మంగళవారమే తెలిసింది. మేమిద్దరం విడివిడిగా మెడిసిన్ పూర్తిచేశాం. నేను ఆమెకు సీనియర్‌ని. 2003లో మాకు పెళ్లయింది. ఇద్దరు పిల్లలున్నారు. 2012లో మేం విడాకులు తీస్కున్నాం. అయితే మా మధ్య ఎప్పుడూ గొడవలు రాలేదు. విడాకుల తర్వాత ఆమెతో నేనెప్పుడూ మాట్లాడలేదు. అసలు ఆమె పెళ్లిళ్లలో తప్ప ఎప్పుడూ కనీసం బురఖా కూడా ధరించేది కాదు. అలాంటిది ఆమెకు ఉగ్రవాద కార్యకలాపాలతో ప్రమేయం ఉందంటే నమ్మలేకపోతున్నాను.' అని హయత్ చెప్పారు. షాహీన్.. అప్పట్లో విదేశాల్లో స్థిరపడాలని తరచూ అంటుండేదని ఆయన తెలిపారు. అయితే.. ఆమె భారత్‌లోనే ఉన్నట్టు ఇటీవలే తెలిసిందన్నారు.వైద్యురాలైన షాహీన్ గురించి విచారణ చేపట్టిన దర్యాప్తు బృందం పలు విషయాలు వెల్లడించింది. 2013లో జీవీఎస్‌ఎమ్ మెడికల్ కాలేజీ నుంచి ఆమె ఎలాంటి సమాచారం లేకుండా అదృశ్యమైందని, ఫలితంగా కాలేజీ యాజమాన్యం ఆమెను తొలగించినట్టు తెలిపింది. ఆల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలో చేరాక.. ఆమెకు డా.ముజామ్మిల్ గనైతో పాటు ప్రస్తుతం అరెస్టైన మరో ఇద్దరు వైద్యులతో పరిచయం ఏర్పడిందని అధికారుల దర్యాప్తులో తేలింది.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

హైదరాబాద్,బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కొలొచ్చాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల పసిడి ధర ఒక్కరోజే దాదాపు రూ.3 వేలకు పైగా పెరిగి రూ.1,31,500కు చేరుకుంది. 22 క్యారెట్ల పుత్తడి ధర ధర రూ.1,17,150 పలుకుతోంది. కిలో వెండి ధర ఒక్కరోజే రూ.10వేలకు పైగా పెరిగి రూ.1,71,300కు చేరింది. అంతర్జాతీయంగా మార్కెట్‌లో పసిడి ధర ఔన్సు మళ్లీ 4200 స్థాయిని దాటి 4,218 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 54.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగా బంగారం, వెండి ధరలు పెరిగాయి. అమెరికా చరిత్రలో అత్యధిక కాలం పాటు కొనసాగిన ప్రభుత్వ షట్‌డౌన్ ఎట్టకేలకు ముగిసింది. దీంతో ఆర్థిక కార్యకలాపాలు ఎప్పటిలానే యథావిధిగా కొనసాగనున్నాయి. ముఖ్యంగా ఎకనామిక్ డేటా వెలువడనుంది. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతకు మార్గం సుగమం కానుంది. ఈ కారణంతోనే బంగారం ధర పెరుగుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. దీనికితోడు డాలర్ ఇండెక్స్ బలహీన పడడం, సెంట్రల్ బ్యాంకుల నుంచి కొనుగోళ్లు ఎప్పటిలానే కొనసాగుతుండడం కూడా పసిడి డిమాండ్‌కు

## తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలయింది. నవంబర్ 15వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి ఈ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ దరఖాస్తులు స్వీకరణకు తుది గడువు నవంబర్ 29వ తేదీతో ముగియనుంది. జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాగా.. 2025 ఏడాదికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్ గత జూన్‌లో విడుదల చేశారు. ఇప్పటికే పరీక్షలు పూర్తి చేయగా.. జులై 22న ఫలితాలు సైతం వెల్లడించారు. తాజాగా రెండో విడత టెట్ నోటిఫికేషన్ గురువారం విడుదల చేశారు. ఇక ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సైతం టెట్‌లో అర్హత సాధించాలంటూ ఇప్పటికే సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల్లో కొనసాగాలంటే.. టీచర్లంతా ఈ టెట్ పాస్ కావాల్సి ఉంది. ఈ పరీక్షకు శుక్రవారం ( నోటిఫికేషన్ విడుదల చేస్తారు. శనివారం నుంచి నవంబర్ 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాల్సి ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో తొలి విడత పరీక్షలు నిర్వహించి.. జులై 22న ఫలితాలు వెల్లడించిన విషయం తెలిసిందే. రెండో విడత టెట్‌కు శనివారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలుకానుంది.

## 2047కి ప్రపంచంలోనే అగ్రస్థానంలో భారతదేశం

విశాఖపట్నం,విశాఖను మోస్ట్ లివబుల్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని.. ప్రధాని మోదీ కూడా ఏపీ అభివృద్ధికి సహకరిస్తున్నారని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. 2038 నాటికి భారత్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందన్నారు. భారతదేశం 2047కి ప్రపంచంలోనే అగ్రస్థానంలోకి రావటాన్ని ఎవరూ ఆపలేరని కూడా చంద్రబాబు తెలిపారు. ÷ూష్ట్ర అభివృద్ధి కోసమే ఓ విజన్ తయారు చేసుకుని అమలు చేస్తున్నామని, దేశంలోని నాలుగు నగరాలకు విజన్ తయారు చేయాలని కేంద్రం నిర్దేశించిందని చంద్రబాబు చెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. ముంబై, వారణాసి, సూరత్, విశాఖల అభివృద్ధికి ఈ సరికొత్త విజన్ అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిందని చంద్రబాబు అన్నారు.అక్షర క్రమంలో, అభివృద్ధి పోటీలో ఏపీనే ఎప్పుడూ ముందుంటుందని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. 'సాగర తీరాన ఉన్న విశాఖ నగరం దేశంలోనే అత్యంత సుందరమైన ప్రాంతం. గత పాలకులు రాష్ట్రాన్ని.. దాని అభివృద్ధిని సర్వనాశనం చేశారు. అందుకే కూటమిగా ప్రజల మద్దతుతో పునర్నిర్మాణం చేస్తున్నాం. రూ.2.66 లక్షల కోట్ల ఎంఓయూలు సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ కంటే ముందే చేశాం. 17 నెలల్లోనే రాష్ట్రానికికి 20 లక్షల కోట్ల పెట్టుబడులు తేగలుగుతున్నాం.' అని చంద్రబాబు అన్నారు. 'గూగుల్ డేటా సెంటర్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో వస్తోంది. అనకాపల్లిలో దాదాపు రూ.1 లక్ష కోట్లతో స్టీల్ ఎ÷-లాంట్ రాబోతోంది. 9 జిల్లాలతో ఏర్పాటు చేస్తున్న విశాఖ ఎకనామిక్ రీజియన్ భవిష్యత్ ఆర్థిక శక్తిగా ఏపీని నిర్దేశిరచే ఓ మోడల్. ఈ ఎకనామిక్ రీజన్ సీఈఓ గా.. ఇండస్ట్రీ సెక్రెటరీ యువరాజు వ్యవహరిస్తారు. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్, సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. విశాఖ ఎకనామిక్ రీజియన్ అథారిటీకి చైర్మన్ హోదాలో నేనే స్వయంగా అభివృద్ధిని పర్యవేక్షిస్తాను.' అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో రూ. 2.66 లక్షల కోట్ల ఎంఓయూలు సీఐఐ భాగస్వామ్య సదస్సు కంటే ముందే చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు (వెల్లడించారు. 9 జిల్లాలతో ఏర్పాటు చేస్తున్న విశాఖ ఎకనామిక్ రీజియన్ భవిష్యత్ ఆర్థిక శక్తిగా.. ఏపీని నిర్దేశిరచే ఓ మోడల్ కానుందన్నారు.విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి , నీతిఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం విడుదల చేశారు. 17 నెలల్లోనే రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తేగలుగుతున్నామని పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్, సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విశాఖపట్నం ఇండస్ట్రియల్ రీజియన్ మాస్టర్ ఎలాన్- 2040కు రూపకల్పన చేశామని, తూర్పుతీరంలో వీఈఆర్ దేశ ఆర్థిక ప్రగతికి గేట్వేగా పనిచేస్తుందని తేల్చిచెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ అథారిటీకి చైర్మన్ హోదాలో తానే స్వయంగా నెలకోసారి అభివృద్ధిని సమీక్షిస్తానని తెలిపారు.

## పెద్దిరెడ్డి భూ అక్రమణలు నిజమే

అమరావతి, మాజీమంత్రి పెద్దిరెడ్డి కుటుంబం అటవీ భూముల కబ్జా నిజమేనని అటవీశాఖ నిర్ధారించింది. దానిని స్వాధీనం చేసుకుంటామని తెలిపింది. ఏపీలో పలుచోట్ల అటవీ భూములను అన్యాక్రాంతం చేశారని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చలపతిరావు అన్నారు. ఆక్రమణలు గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు కమిటీలు వేసినట్లు చెప్పారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల కబ్జాపై గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. చిత్తూరు జిల్లా మంగళంపేటలో 32.63 ఎకరాల భూమి కబ్జాకు గురైనట్లు కమిటీ నిర్ధరించిందని చెప్పారు. ఆ భూమిని స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని రిట్ పిటిషన్లపై కోర్టులో వాదనలు జరుగుతున్నాయని, ఎక్కడ ఆక్రమణలు ఉన్నా స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. అక్రమార్కులను ప్రోత్సహించిన అధికారులపైనా చర్యలు తప్పవన్నారు. పెద్దిరెడ్డి కుటుంబసభ్యుల అధీనంలో అటవీ భూములున్నాయి. ఆయన పేరిట 15 ఎకరాలు, ఇందిరమ్మ పేరిట 10.8 ఎకరాలు, మిథున్‌రెడ్డి పేరుతో 21 ఎకరాలు, పి.ఇందిరమ్మ పేరిట 9.8 ఎకరాలు ఉన్నాయి. పెద్ది రెడ్డి కుటుంబ సభ్యుల పేర్లతో 74 ఎకరాల వరకు ఉన్నాయి. ఈ భూములకు ఆనుకొని ఉన్న 32.63 ఎకరాల అటవీ భూములను పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించుకుంది. అటవీ భూముల్లో మామిడి, ఉద్యాన పంటలు సాగు చేశారు. అటవీ భూముల్లో పంటలను పూర్తిగా తొలగించాం. ఆక్రమణదారులపై కేసులు నమోదు చేశాం, కోర్టులో విచారణ జరుగుతోంది. అటవీ భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో పెట్టాలని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించారు. సర్వే పూర్తి చేసి స్థలాల వివరాలతో వెబ్ ల్యాండ్‌లో పెడతాం. అటవీ భూముల ఆక్రమణపై కమిటీ నిర్ధరించింది. ఇతర అనుమతులపై రెవెన్యూశాఖ విచారణ జరుపుతోందని తెలిపారు.

## గూగుల్‌కు తోడి టిసిఎస్ కూడా వస్తోంది

విశాఖపట్నం, విశాఖపట్నంలో త్వరలో 30 వేల ఉద్యోగాలు రానున్నాయని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. గురువారం విశాఖపట్నంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. గూగుల్ సెంటర్ ఏర్పాటుకు చాలా కష్టపడ్డామని చెప్పారు. గూగుల్ మన రాష్ట్రానికి రావడానికి కేంద్రం సహకారం సైతం ఉందని తెలిపారు. విశాఖకు త్వరలో టీసీఎస్ కూడా రానుందన్నారు. కేవలం టీసీఎస్ కాకుండా ఇతర కంపెనీలను తీసుకువస్తున్నట్లు ఆయన వివరించారు. అలాగే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆక్వా పరంగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు.

# ప్రాణదాతలే యమకింకరులైతే..

హైదరాబాద్,వైద్యో నారాయణో హరి అన్న సూక్తి ప్రకారం రోగుల ప్రాణాలను కాపాడవలసిన వైద్యులే మారణకాండకు పాల్పడే ఉగ్రవాద భూతానికి ఆయుష్షు పోయడం విపరీతం. ఢిల్లీ ఎర్రకోట సమీపాన ఉగ్రవాద ఆత్మాహుతి బాంబు దాడి వెనుక కొంతమంది డాక్టర్ల పాత్ర ఉండడం దేశచరిత్రలో అత్యంత సంచలనాత్మక సంఘటన. ఇది పూర్తిగా ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్ కుట్రయే. దేశవ్యాప్తంగా నాలుగు నగరాల్లో దాడులు సాగించడానికి ఫక్కా ప్రణాళిక సిద్ధమైంది. దీనికోసం ఎనిమిది మంది ఆత్మాహుతి బాంబర్లను సిద్ధం చేసినట్టు బయటపడింది. ఈ కుట్ర ప్రణాళికలో డాక్టర్ ఉమర్ నబీ, డాక్టర్ ముజమ్మిల్ కీలక పాత్ర పోషించినట్టు వారి డైరీల ద్వారా తేలింది. ఫరీదాబాద్‌లో అల్ ఫలా యూనివర్సిటీ లోని మెడికల్ కాలేజీ లోని బాయ్స్ హాస్టల్ గది ఒకటి కేంద్రంగా ఉగ్రకార్యకలాపాలకు వ్యూహం రూపొందిందని దర్యాప్తు సంస్థలు కనుగొన్నాయి. ఈ కుట్రకు నిందితులు దాదాపు రూ.20 లక్షల వరకు నిధులు సేకరించినట్టు తాజా సమాచారం. ఇంతవరకు కశ్మీర్ సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలు సాగుతుండడం వాటిని భద్రతా దళాలు భగ్నం చేయడం పరిపాటిగా వస్తోంది. కానీ ఇప్పుడు దేశం లోపలే నగరాల్లో ఉగ్రకార్యకలాపాలకు సన్నాహాలు సాగుతుండడం కొత్తమలుపు.గత రెండు దశాబ్దాలుగా వందలాది ఉగ్రవాద పన్నాగాలను ఛేదించి దేశభద్రతను సంరక్షించడంలో భద్రతా దళాలు ముందంజ వేస్తున్నాయని ఘనతను సాధించుకున్నాయి. అయితే ఢిల్లీ ఎర్రకోట వద్ద ఉగ్రవాద ఆత్మాహుతి బాంబు దాడి గురించి లభించిన సాక్షాధారాల ప్రకారం ఇది తొందరపడి చేసిన చర్యగా భావిస్తున్నారు. ఎందుకంటే ఈ దురాగతానికి పాల్పడే వారిలో ఒకరు ముందుగానే అరెస్ట్ అయ్యారని తెలిసి ఈ వల నుంచి తప్పించుకుని పారిపోడానికి చేసిన ప్రయత్నమే ఆత్మాహుతి బాంబు దాడికి దారితీసిందని తేలింది. అయినప్పటికీ అనుకోలేని ఘోర విపత్తు జరిగిపోయింది. కుట్రదారుడు ఒకరు తప్పించుకుపోయాడంటే భద్రతా సంస్థల నిఘా ఎలా నిద్రపోతోందో స్పష్టంగా చెప్పవచ్చు. జమ్మూకశ్మీర్ ప్రాంతంలోపల, బయట నుంచి చొరబాట్లను రెగ్యులర్‌గా నియంత్రించే ఆపరేషన్లు సాగుతున్న నేపథ్యంలో జమ్మూకశ్మీర్ కాకుండా ఫరీదాబాద్ వంటి నగర ప్రాంతాల్లో ఉగ్ర సంఘటనను నివారించడంలో భద్రతా సంస్థల ఘోరవైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. దేశంలో ఎక్కడ ఇలాంటి సంఘటనలు జరిగినా వాయువేగంలో భద్రతా సంస్థలు నివారించి దేశ ప్రజల ప్రాణాలకు రక్షణ కలిగిస్తుంటాయి.అలాంటిది దేశ రాజధానిలో ఆత్మాహుతి బాంబు కదలాడుతుండడం గమనించలేకపోవడం శోచనీయం. కశ్మీర్ లోయలో జరిగే ఉగ్రకార్యకలాపాలకు ఫరీదాబాద్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉందని అనుమానించవలసి వస్తోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్(పిఒకె)లోను, పాకిస్థాన్ లోనూ ఆపరేషన్ సిందూర్ ప్రకంపనలు ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న విష సర్పాలకు మరింత ద్వేషాన్ని రెచ్చగొట్టాయి. ప్రతీకార పన్నాగాలతో మూడు టన్నుల ప్రాణాంతక పేలుడు పదార్థాలతో దాడులకు సిద్ధమయ్యాయని భావిస్తున్నారు. వాటిని కానీ పట్టుకొనకపోతే మరీ భారీ విధ్వంసం జరిగి ఉండేది. అంతకు ముందే కశ్మీర్ లోయలో బెదిరిస్తూ



పోస్టర్లు వెలిశాయి. కానీ భద్రతా దళాలు అంతగా పట్టించుకోలేకపోవడంతో ఫరీదాబాద్ ఉగ్రవాద పన్నాగం కొంతవరకు నెరవేరిందని చెప్పవచ్చు. దీనిని బట్టి నిఘా అన్నది అణువణువూ గాలించే నిరంతర చర్యగా ఉండాలన్నది తెలియజెప్తోంది. ఇవన్నిటి కన్నా కంపరం కలిగించేది ఈ భారీ కుట్రలో మెడికల్ ప్రొఫెషనర్లే కీలక పాత్ర వహించడం. వైద్య ధర్మ ప్రమాణ స్వీకారం చేసిన ఈ వైద్య గ్రాడ్యుయేట్లు ఉగ్రకుట్రలో భాగస్వాములు కావడం, ఉగ్రవాద భావజాలాన్ని వ్యాపింప చేసి ఇతరులను మార్చడానికి నిరంతరం పనిచేయడం అనూహ్య పరిణామాలు. కనీసం ఐదుగురు డాక్టర్లు ఇందులో ప్రధాన బాధ్యత వహించారు. వీరిలో నలుగురు కశ్మీర్‌లో పుట్టి పెరిగిన వారే. ఇది పెద్ద సమస్యకు సంకేతం. విద్యావంతులైన వారు రహస్యంగా దేశ విద్రోహ చర్యలకు పూనుకుని వాటి కమ్యూనికేషన్‌కు సంబంధించిన అత్యంత ఆధునిక పరికరాలను సమకూర్చుకుని, వివిధ రకాల బాంబులను ఏయే రసాయనాలతో తయారు చేయవచ్చునో ఆన్‌లైన్ ద్వారా తెలుసుకుని, రిమోట్ కంట్రోలు ద్వారా వాటిని పేల్చడంలో తర్ఫీదు పొందడం, ఆయా కార్యకలాపాల్లో చేరడం ఇవన్నీ భద్రతా వ్యవస్థలకు పెద్ద సమస్య కావడమే కాక, అమాయక ప్రజల ప్రాణాలకు గండంగా తయారైంది. ఈ విధమైన వైట్‌కాలర్ టెర్రరిజం అనాగరిక చర్యల్లో కూడా విద్యావంతులు చురుకుగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాలకు రావడం భద్రతా సంస్థలకు పెద్ద సవాలుగా మారింది. ఆపరేషన్ సిందూర్ తరువాత పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో భౌగోళిక రాజకీయాల్లో మార్పు వచ్చింది. ఉగ్రవాద బెదిరింపులు ఇంతటితో సమసిపోవు. కశ్మీర్ లోయకు అతీతంగా తమ వేయితలలు అటూఇటూ చూస్తుంటాయి. ఉగ్రవాదులను లక్షంగా చేసుకుని దాడులు సాగించడంతో భద్రతా దళాల బాధ్యత తీరిపోదు. ఆయా ప్రాంతాల వారి మనుషులతో, వారి జీవన పరిస్థితులతో, వనరులతో మమేకమై జాతీయ స్థాయిలో ప్రయత్నాల సమన్వయంతో నిఘా సమాచారాన్ని సేకరించగలిగే సామర్థం పెంపొందించుకోవాలి. దేశంలో ఎక్కడ ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలకు కుట్రలు రూపొందుతున్నా తక్షణం భగ్నం చేసేలా వ్యవస్థలను తీర్చిదిద్దాలి. దీనికి సమయం అనుకూలించకపోవచ్చు. కానీ రాజకీయ కోణంలో భద్రతా విషయంలో పూర్తి నియంత్రణ కొనసాగిస్తూ జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తిరిగి కట్టబెట్టడం సముచితం కావచ్చు.

# దాతృత్వంలో మేటి శివనాడార్

హైదరాబాద్,మన దేశంలో చాలా మందికి అత్యంత ధనవంతులు ఎంత దానం చేస్తున్నారో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంటుందని చెప్పొచ్చు. ఇక దీనిపైనా పలు సంస్థలు ఎప్పటికప్పుడు డేటా విడుదల చేస్తుంటాయి. ఈ సంవత్సరంలో ఏకంగా రూ. 10,380 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఇందులో మొత్తం 191 మంది దాతలు ఉన్నారు. వీరిలో 12 మంది కొత్తవారే ఉన్నారు. గత మూడేళ్లలో చూస్తే వీరి విరాళాల మొత్తం 85 శాతం పెరగడం గమనార్హం. టాప్-10 లిస్టులో ఉన్న వారి విరాళాల మొత్తమే రూ. 5,834 కోట్లుగా ఉంది. అత్యంత ధనవంతుల్లో అంబానీ, అదానీ వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నప్పటికీ.. దాతృత్వంలో మాత్రం తొలి స్థానం శివనాడర్ దే. మనిషి సంఘజీవి. ఇతరులతో వ్యవహరించే క్రమంలో మనిషి.. ఆయా పరిస్థితుల్లో వివిధ రకాలుగా ప్రతిస్పందిస్తుంటాడు. వీటిలో కొన్ని అనుకూల ధోరణికి ప్రతిబింబాలయితే, కొన్ని ప్రతికూల స్పందనలు. సుగుణాల విషయానికి వస్తే.. అందులో దయాగుణానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. సాటి మనిషితో దయతో వ్యవహరించాలని మన సంస్కృతి మనకు బోధిస్తుంది. మనం ఒక తల్లి బిడ్డలుగా మసలుకోవాలని, తోటివారి కష్టసుఖాలను ఓ కంటకనిపెట్టి వారిని ఆదుకోవాలని పెద్దలు చెబుతుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని సంస్కృతుల్లోనూ ఈ భావన కనిపిస్తుంది. అయితే మానవుడి జీవన వేగం పెరగటం, ప్రపంచీకరణ వంటి పలు ప్రభావాలవల్ల మనిషి జీవన వేగం పెరిగింది. ఈ క్రమంలో తోటివారి సంగతి కాసేపు పక్కన పెడితే.. సొంత తోబుట్టువులు, తల్లిదండ్రులనే పట్టించుకోవటం లేదు. ఈ నేపథ్యంలో సొంతలాభం కొంత మాని.. పొరుగువారి గురించి ఆలోచించాలని మనకు గుర్తుచేస్తోంది..1997లో జపాన్‌లోని టోక్యోలో వరల్డ్ కైండ్‌నెస్ మూవ్‌మెంట్ మొదలైంది. వ్యక్తుల మధ్య మాత్రమే కాదు, జాతుల మధ్య, సమాజాల మధ్య, ప్రాంతాల మధ్య, దేశాల మధ్య కూడా వెల్లివిరిసి 'వసుధైక కుటుంబం' అనే స్వప్నం సాకారం కావాలని జరిగిన తొలిసమావేశంలో నిర్వాహకులు ప్రకటించారు. మనకు అన్నీ ఇచ్చిన సమాజానికి మనవంతుగా ఏమైనా తిరిగివ్వాల్సిన బాధ్యత ప్రతి మనిషి మీదా ఉందనే సంకల్పాన్ని ఆ సమావేశంలో ప్రకటించారు. క్రమంగా ఈ సందేశం ఆస్ట్రేలియా, కెనడా, నైజీరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి అనేక దేశాలకు చేరింది. దీంతో ఆయా దేశాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది. 1998 తర్వాత ఈ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది, 2005లో యుకెలో, 2009 నాటికి సింగపూర్, 2010లో ఫ్రాన్స్, అమెరికా ఇలా 2019 నాటికి, ఈ ఉద్యమం 27 దేశాలకు వ్యాపించింది. 2025 నాటికి మరిన్ని దేశాలు ఈ ఉద్యమంలో పాలుపంచుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మన సమాజంలో ఆర్థికపరమైన అంతరాలు వేగంగా పెరుగుతున్నాయి. దీనివల్ల పేదలు మరింత పేదరికంలో కూరుకుపోతుండగా, ధనికుల వద్ద మరింత సంపద పోగుపడుతోంది. ఈ అంతరాలను గుర్తించిన ప్రభుత్వాలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పేరుతో సంపన్నుల నుంచి కొంత పన్ను వసూలు చేసి పేదలకు వెచ్చిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎపిలోని కూటమి సర్కారు ఈ ఏడాది ఉగాది నాడు.. పీ4 అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్‌నర్ షిప్ అనే నాలుగు అంశాలతో కూడిన ఈ కార్యక్రమం కింద జనాభాలోని అత్యంత సంపన్నులైన 10% మంది పేద కుటుంబాల్లో అట్టడుగున ఉన్న 20 శాతం మందికి నేరుగా సాయం చేయనున్నారని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో విరాళాలు ఇచ్చే సంపన్న వ్యక్తులను మార్గదర్శకులుగా, పేద లబ్ధిదారులను బంగారు కుటుంబాలుగా గుర్తిస్తారు. ప్రభుత్వం డిజిటల్ డాష్ బోర్డుల ద్వారా ఈ సాయం పురోగతిని గుర్తిస్తూ ఒక ఫెసిలిటేటర్ గా వ్యవహరిస్తోంది. సంపన్నుల నిధులను ఇళ్ల నిర్మాణం, పారిశుధ్యం, తాగునీరు, డిజిటల్ కనెక్టివిటీ, సోలార్, స్వయం ఉపాధి అందించటం వంటివాటికి ఖర్చు చేస్తున్నారు.అలాగే, మన దేశంలోని అనేక మంది సంపన్నులు దయాగుణంతో




పేదల సేవకై ముందుకొస్తున్నారు. విద్య, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధి, ఇంకా అనేక సంక్షేమ కార్యక్రమాల కోసం ఈ ఒక్క ఏడాదిలో వారు రూ. 10 వేల కోట్లకు పైగా వెచ్చించారు. 'ఎడెల్‌గివ్ హురున్ ఇండియా' తాజాగా విడుదల చేసిన దాతృత్వ సంపన్నుల జాబితాలో ఈ ఏడాది కూడా నాడార్ కుటుంబమే అగ్రస్థానంలో ఉంది. 2024- 25లో శివ్ నాడార్ ఫౌండేషన్ అత్యధికంగా రూ. 2,708 కోట్ల విరాళాలు ఇచ్చింది. అంటే రోజుకు సుమారు రూ.7.4 కోట్లు అన్నమాట. తరవాతి స్థానాల్లో రూ. 626 కోట్లతో ముకేష్ అంబానీ, రూ. 446 కోట్ల విరాళాలతో మూడవస్థానంలో బజాజ్ కుటుంబం నిలిచాయి. హురున్ ఇండియా నిరుటి జాబితాలో 203మంది నిలవగా, తాజా జాబితాలో 191మంది చోటు దక్కించుకున్నారు.అయితే, సగటు విరాళం గతంతో పోలిస్తే రూ. 43 కోట్ల నుంచి రూ. 54 కోట్లు పెరిగింది. కాగా, తాజా జాబితాలోని దాతలు ఇచ్చిన విరాళం మొత్తం రూ.10,380 కోట్లు అని నివేదిక వెల్లడించింది. మన పొరుగుదేశం చైనా జిడిపి దాదాపు 20 ట్రిలియన్ డాలర్లు కాగా, ఇండియా జిడిపి 4 ట్రిలియన్ డాలర్ల మాత్రమే. కానీ, మనం దాతృత్వంలో చైనాతో సరితూగుతున్నామని, భవిష్యత్తులో దాతృత్వంలో భారతదేశం ప్రపంచ దేశాలకు మార్గదర్శిగా ఉంటుందని నివేదిక ప్రశంసించింది. ఇతరులకు సాయం చేయటానికి వచ్చిన ప్రతి అవకాశాన్ని మన సమాజం వీలయిన మేర వినియోగించుకోవాలి. దానినో అరుదైన అవకాశంగా భావించాలి. మనకు అన్నీ ఇచ్చిన సమాజానికి మనం ఆ మాత్రం చేయలేకపోతే..మన సమాజంలో ఎంత సంపద, జ్ఞానం ఉన్నప్పటికీ,అది నరకప్రాయంగానే మారుతుంది.

## బీహార్ ఫలితాలు మోడీ పనితీరుకు నిదర్శనం

న్యూఢిల్లీ,బిహార్ ఎన్నికల ఫలితాలపై బీజేపీ మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లో బీజేపీ, జేడీయూ కలిసి 202 స్థానాల్లో పోటీ చేసిందని వివరించారు. బిహార్ ఎన్నికల ఫలితాల్లో భారీ విజయం దక్కడం కూటమి నేతల పనితీరుకు నిదర్శనమని ఉద్ఘాటించారు. బిహార్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఉందని నొక్కిచెప్పారు. శుక్రవార ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనకు నిదర్శనంగా బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏకు ప్రజలు ఓటేశారని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కార్ కేవలం నినాదం కాదని చెప్పుకొచ్చారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉండాలనే విధంగా బిహార్ ప్రజలు ఓటేశారని చెప్పుకొచ్చారు. బిహార్ ఎన్నికలు కులాల సమీకరణ కాదని స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో( కూడా కులాల సమీకరణ ఉందని వివరించారు.బిహార్ ఎన్నికల్లో సామాజిక సమీకరణాలు పనిచేస్తాయని, ఈ విజయం అభివృద్ధికి దక్కిన పట్టమని ఉద్ఘాటించారు. ఇది అద్భుతమైన విజయమని నొక్కిచెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సీఎం నితీష్ కుమార్ చేసిన ప్రచారం, అభివృద్ధికి ప్రజలు ఓటు వేశారని చెప్పుకొచ్చారు జీవీఎల్ నరసింహారావు. 2000 సంవత్సరంలో ఆర్జేడీకి మెజార్టీ సీట్లు వచ్చాయని గుర్తుచేశారు.

## భారీగా పెరుగుతూ..స్వల్పంగా తగ్గిన బంగారం

హైదరాబాద్,దీపావళి అనంతరం బంగారం, వెండి ధరలకు రెక్కొలొచ్చాయి. వరుసగా పెరుగుతూ లక్షా 35 వేలకు చేరువైంది. ఆపై వరుసగా గోల్డ్ రేట్స్ వరసగా తగ్గాయి. ఇటీవలి రోజుల్లో హెచ్చుతగ్గులు జరుగుతున్నాయి. నిన్న భారీగా పెరిగిన పుత్తడి ధరలు.. ఈరోజు కాస్త ఊరటనిచ్చాయి. బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 1 గ్రాము బంగారం ధర రూ.80 తగ్గి.. రూ.12,785 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల 1 గ్రాము ధర రూ.70 తగ్గి.. 11,720గా కొనసాగుతోంది. 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,27,850గా.. 22 క్యారెట్ల ధర రూ.1,17,200గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే 24 క్యారెట్లపై రూ.800.. 22 క్యారెట్లపై రూ.700 తగ్గింది. హైదరాబాద్ మార్కెట్‌లో స్వచ్ఛమైన 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల ధర రూ.1,27,850 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారట్ల 10 గ్రాముల ధర రూ.1,17,200గా పలుకుతోంది. విశాఖ, విజయవాడలో ఇవే ధరలు కొనసాగుతున్నాయి. మరోవైపు వెండి ధరలు మాత్రం వరుసగా ఐదవ రోజు పెరిగాయి. కిలో వెండిపై నిన్న ఏకంగా 11 వేలు పెరగగా.. నేడు స్వల్పంగా రూ.100 పెరిగింది. బులియన్ మార్కెట్‌లో ఈరోజు కిలో వెండి ధర రూ.1,73,100గా ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్, విశాఖ, విజయవాడలో రూ.1,83,000గా కొనసాగుతోంది.

## కొంప మునిగింది ఇందుకే..!!

పాట్నా:దేశవ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకే చర్చ. అదే బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు. రెండు దశల్లో బీహార్ అసెంబ్లీకి పోలింగ్ జరిగింది. 1951లో తొలిసారి రాష్ట్రానికి అసెంబ్లీ ఎన్నికలు జరుగగా ఇక అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎప్పుడూ ఈ స్థాయిలో పోలింగ్ నమోదు కాలేదు.ఏకంగా 69శాతం పోలింగ్ నమోదైంది. దీంతో ఈ సారి ఫలితాలు నువ్వా నేనా అన్నట్లుగా ఉంటాయని అంతా అంచనా వేశారు. కానీ రియల్ పిక్చర్ మాత్రం ఇందుకు భిన్నంగా కనిపించింది. ఎన్డీయే కూటమి కూల్‌గా విజయం వైపు అడుగులు వేస్తోంది. ఇక ఎప్పటి నుంచో సీఎం పీఠం కోసం ఎదురుచూస్తోన్న ఆర్జేడీ అధినేత తేజస్వీ యాదవ్‌కు మరో సారి భంగపాటు కలిగింది. మరో ఐదేళ్లు ప్రతిపక్షానికే పరిమితం కావాల్సి వస్తోంది. తేజస్వీ లేదా ఆర్జేడీ కూటమి ఓటమిపాలు కావడానికి ప్రధానంగా ఐదు కారణాలు కనిపిస్తున్నాయి.

52 టికెట్లు యాదవ సామాజిక వర్గానికి..

బీహార్‌లో కులరాజకీయమే రాజ్యమేలుతుందనేది ఓపెన్ సీక్రెట్. తేజస్వీ యాదవ్ కూడా కులాల ఈక్వేషన్‌ను నమ్ముకుని టికెట్లు కేటాయించడం జరిగింది.ఇదే ప్రధానంగా దెబ్బతీసిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. తన సొంత సామాజికవర్గమైన యాదవ సామాజిక వర్గానికి 52 టికెట్లను కేటాయించారు. అయితే ఈ నిర్ణయమే ఆర్జేడీకి నష్టం కలిగించింది. 52 సీట్లు యాదవ్ కులానికి కేటాయించడంతో యాదవేతరులు లేదా నాద్ యాదవ్ కమ్యూనిటీ ఆర్జేడీకి దూరమైందనే చెప్పాలి. జనాభాలో 14శాతం యాదవులు ఆర్జేడీకి ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్నారు.దీంతో ఇతర అగ్ర కులాలు, వెనకబడిన సామాజిక వర్గాలు మహాకూటమికి దూరం అయ్యారు.ఆర్జేడీ మొత్తం 144 స్థానాల్లో పోటీ చేయగా, అందులో 52 మంది యాదవులు ఉన్నారు. బీజేపీ తమ ఎన్నికల ప్రచారంలో '%=జీణ% యాదవ రాజ్' అనే కథనాన్ని బలంగా వినిపించింది.ఇది పట్టణ,మధ్య తరగతి ఓటర్లలో బాగా ప్రతిధ్వనించింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్ మాదిరిగా, తేజస్వి కూడా 30-35 స్థానాలు యాదవ సామాజిక వర్గానికి మాత్రమే కేటాయించి ఉండి ఉంటే, కుర్మీ-కోయిరి వంటి వర్గాల ఓట్లు పెరిగే అవకాశం ఉండేది.

మిత్రపక్షాలను విస్మరించడం...

ఇదిలా ఉంటే తేజస్వీ యాదవ్ వ్యూహంలో కూడా అతిపెద్ద లోపం కనిపించింది.మిత్రపక్షాలైన కాంగ్రెస్, వామపక్షాలు ఇతర చిన్న పార్టీలను విస్మరించడం.సీట్ల పంపకాల వివాదం కూడా మహాకూటమిని బలహీనపరిచి ఉండొచ్చు.కాంగ్రెస్ 'హామీల' మేనిఫెస్టోపై దృష్టి పెడితే, తేజస్వి కేవలం 'ఉద్యోగాలు' అనేదానికే ప్రాధాన్యత ఇచ్చారు, ఇది మిత్రపక్షాలకు రుచించలేదనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రచారంలోనూ రాహుల్ గాంధీ వంటి మిత్రపక్ష నాయకులకు వెనుక సీటు ఇచ్చి, కేవలం తానే ప్రమోట్ అయ్యేలా తేజస్వీ చొరవ చూపడంతో మైనస్ అయి ఉండొచ్చు.

వాగ్దానాలకు బ్లూప్రింట్ ఇవ్వలేకపోవడం

తేజస్వి అతిపెద్ద హామీ (ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం, పింఛను వంటివి) చేసినా, వాటికి సంబంధించిన ఖచ్చితమైన కార్యాచరణ ప్రణాళిక (బ్లూప్రింట్‌ను) ఇవ్వలేకపోవడం ఓటర్లలో అపనమ్మకాన్ని సృష్టించింది. నిధులు, అమలు ప్రణాళికపై స్పష్టత లేకపోవడం ప్రధాన లోపంగా మారింది. 'మరో 2 రోజుల్లో బ్లూప్రింట్ వస్తుంది' అని ప్రతిరోజూ చెబుతూ వచ్చినా, ఎన్నికల ప్రచారం ముగిసే వరకు ఆ స్పష్టత రాలేదు. దీంతో ఓటర్లలో ఆయన వాగ్దానాలపై విశ్వాసం సన్నగిల్లింది.


మహాకూటమికి ముస్లిం పక్షపాత ముద్ర

మహాకూటమికి ఉన్న 'ముస్లిం-పక్షపాత' ముద్ర కూడా తేజస్వి యాదవ్ ఓటమికి పెద్ద కారణంగా నిలిచింది. ముస్లింలు అధికంగా ఉన్న స్థానాల్లో మహాకూటమికి మద్దతు లభించినా, రాష్ట్రవ్యాప్తంగా ఈ ముద్ర నష్టం చేసింది. బీహార్‌లో అధికారంలోకి వస్తే వక్ఫ్ బిల్లును అమలు చేయబోమని తేజస్వి యాదవ్ చేసిన ప్రకటన కొందరు యాదవులకు కూడా నచ్చలేదు. బీజేపీ ఈ అంశాన్ని, ముఖ్యంగా వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా లాలూ ప్రసాద్ పార్లమెంటులో ఇచ్చిన పాత ఉపన్యాసాన్ని బాగా వైరల్ చేయడం, ఎన్డీఏకు ప్రయోజనం చేకూర్చింది.

## బుక్ చదవి షాక్ గురయ్యా

అమరావతి, ఎర్రచందనం అక్రమ రవాణా పై తాను చదివిన ఓ పుస్తకం ఎంతో ఆశ్చర్యానికి గురి చేసిందని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. అక్రమ రవాణాలో ఓ వ్యక్తి తనను తాను ఎలా కింగ్ పిన్‌లా మార్చుకున్నాడో చూసి షాక్ అయినట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు పవన్. 'కొంతకాలం క్రితం నేను ది వైల్డ్ ఈస్ట్ చదవడం మొదలుపెట్టాను. ఆ పుస్తకంలోని వివరాలు ఎంతో ఆశ్చర్యకరమైనవి. ఈ పుస్తకం శేషాచలం ప్రాంతం, తూర్పు కనుమలలో ఎర్రచందనం దోపిడీ గురించి చెబుతుంది. మన విలువైన సహజ వనరులను వ్యవస్థ ముందే ఎలా దోచుకున్నారో చూపిస్తుంది. రాజకీయాల వెనుక దాక్కున్న కొంతమంది నాయకులు పూర్తి స్థాయి మాఫియా బాస్‌లాగా ఎలా వ్యవహరించారో ఇది వెల్లడిస్తుంది. వారిలో ఒక పాత్ర నా దృష్టిని ఆకర్షించింది. దాదాపు ఒక సినిమాలాగా ఎర్రచందనంపై దురాశతో అధికారాన్ని వాడుకుని ఓ చిన్న కాంట్రాక్టర్ మొత్తం నేర సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించాడో చూపించాడు రచయిత. మీరు ఆ పుస్తకం చదివినప్పుడు, నేరాన్ని అర్థం చేసుకోలేరు. భూమి, అడవులు, ప్రకృత, ప్రజలపై ద్రోహాన్ని అనుభవిస్తారు' అని పవన్ కల్యాణ్ తెలిపారు. కాగా, గత శనివారం నాడు తిరుపతి మంగళంలో ఎర్రచందనం గోడౌన్లను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలించారు. గ్రేడ్ల వారీగా ఎర్రచందనం వివరాలను అధికారులను అడిగి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు. స్మగ్లింగ్‌కు గురికాకుండా ఎర్రచందనాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులతో చర్చించారు. వైసీపీ పాలనలో రూ.5వేల కోట్ల మేర ఎర్రచందనం స్మగ్లింగ్ జరిగి ఉంటుందని ఆరోపించారు.

# చిత్రమైన ఓటు షేరు.. ఎక్కువ ఓట్లు వచ్చినా సీట్లు రాలేదే..?



న్యూఢిల్లీ,బిహార్ ఎన్నికల్లో ప్రజలు చిత్రమైన తీర్పునిచ్చారు. ఈ ఎన్నికల్లో అత్యధిక సీట్లు తెచ్చుకున్న పార్టీలు కన్నా, ఎక్కువ ఓట్లు తెచ్చుకున్న పార్టీగా ఆర్జేడీ నిలిచింది. బిహార్ ఎన్నికల్లో మొత్తం 17 పార్టీలు పోటీ చేశాయి. ఇందులో గుర్తింపు పొందిన జాతీయ పార్టీలతోపాటు ప్రాంతీయ పార్టీలు, చిన్నాచితక పార్టీలు అనేకం ఉన్నాయి. 243 స్థానాలు ఉన్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి వర్సెస్ మహాగట్ బంధన్ మధ్య పోటీ జరిగింది. ఎన్డీఏ కూటమిలో బీజేపీ, జేడీయూ, లోక్ జనశక్తి (రామ్ విలాస్ పాశ్వన్), హెచ్ఎంఎస్ వంటి పార్టీలు ఉండగా, మహాగట్ బంధన్ లో ఆర్జేడీ, కాంగ్రెస్, వీఐపీ పార్టీలతోపాటు కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయి.అయితే తాజా ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీ, జేడీయూ కన్నా ఆర్జేడీకే ఎక్కువ ఓట్లు వచ్చాయి. ఎన్నికల సంఘం ప్రకటించిన ఓట్ల శాతం పరిశీలిస్తే ఈ విషయం చాలా స్పష్టంగా అర్థం అవుతోంది. ఎన్నికల సంఘం 17 గుర్తింపు పొందిన పార్టీల ఓట్ల శాతాన్ని తన అధికారిక వెబ్ సైటులో వెల్లడించింది. ఈ 17 పార్టీల్లో అత్యధికంగా ఆర్జేడీ ఎక్కువ ఓట్ల శాతంతో తొలిస్థానంలో నిలిచింది. మొత్తం 143 స్థానాల్లో పోటీ చేసిన ఆర్జేడీ 22.85 శాతం ఓట్లతో మిగిలిన పార్టీలకన్నా మెరుగైన స్థితిలో నిలిచింది. ఆర్జేడీ తర్వాత బీజేపీ 20.31 శాతం, జేడీయూ 19.12 శాతం ఓట్లతో రెండు మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ రెండు పార్టీలు చెరో 101 స్థానాల్లో పోటీ చేశాయి.ఇక 22.85 శాతం ఓట్లు తెచ్చుకున్న ఆర్జేడీ.. సీట్ల పరంగా చాలా వెనకబడింది. 143 స్థానాల్లో పోటీ చేసి కేవలం 25 చోట్ల మాత్రమే గెలిచింది. ఇక ఆర్జేడీ కన్నా తక్కువ ఓట్లు తెచ్చుకున్న బీజేపీ, జేడీయూ మాత్రం గణనీయమైన రీతిలో సీట్లు సాధించాయి. బీజేపీ 101 చోట్ల పోటీ చేస్తే కేవలం 20.31 శాతం ఓట్లతో 91 చోట్ల గెలుపొందింది. అదే సమయంలో జేడీయూ సైతం 101 స్థానాల్లో పోటీ చేసిన 19.12 శాతం ఓట్లు తెచ్చుకుని 83 స్థానాల్లో గెలుపొందింది. ఓట్లు ఎక్కువ వచ్చినా ఆర్జేడీకి సీట్లు రాకపోవడమే అంతుచిక్కడం లేదు. ఇక ఎన్డీఏ కూటమి తరపున పోటీ చేసిన ఎల్జేపీ (పాశ్వన్) పార్టీకి 5.03 శాతం ఓట్లు వచ్చాయి. ఈ పార్టీ 26 చోట్ల విజయం సాధించడం విశేషం. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ 8 శాతం ఓట్లు సాధించినా పెద్దగా సీట్లు తెచ్చుకోలేకపోయింది. బిహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 6 చోట్ల మాత్రమే గెలిచింది.ఇదే సమయంలో చెరో ఐదు చోట్ల గెలుచుకున్న ఎంఐఎం, హెచ్ఏఎంఎస్ కూడా పెద్దగా ఓట్లు సాధించలేదు. కానీ సీట్లు సాధించి తమ సత్తా చాటాయి. ఇక బిహార్ ఎన్నికల్లో ఇతరులు తొమ్మిది చోట్ల గెలుపొందారు. కాగా, ఆర్జేడీ, బీజేపీ, జేడీయూకి తప్పించి మరే పార్టీ డబుల్ డిజిట్ లో ఓట్ల శాతం నమోదు చేసుకోలేకపోయింది. మహాగట్ బంధన్ లో పోటీ చేసిన సీపీఐ(ఎం) 0.62 శాతం, సీపీఐ(ఎంఎల్)(ఎల్) 2.89 శాతం, సీపీఐ 0.74 శాతం ఓట్లు తెచ్చుకున్నాయి. ఒకప్పుడు బిహార్ లో ఎంతో శక్తివంతమైన పాత్ర పోషించిన కమ్యూనిస్టులు ఈ ఎన్నికతో ప్రభావం కోల్పోయినట్లు స్పష్టమైందని అంటున్నారు.

# పవన్ దూకుడు.. ఫలితం త్వరలోనే..!



అమరావతి,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పలు అంశాలపై నిశితంగా దృష్టి పెడుతున్నారు. తన శాఖలకు సంబంధించే కాకుండా.. తన పార్టీకి చెందిన కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ శాఖలకు సంబంధించి కూడా ఆయన పర్యవేక్షణ చేస్తున్నారు. ఆయా శాఖల్లో జరుగుతున్న పరిణామాలు.. వెలుగు చూస్తున్న అ క్రమాలపై పవన్ ఓ కన్నేస్తున్నారు. ఈ క్రమంలోనే బియ్యం అక్రమ రవాణా సహా.. అటవీ సంపద అక్ర మాలు.. పంచాయతీ నిధులు వంటివాటిపై దృష్టి పెట్టారు.గతంలో బియ్యం అక్రమ రవాణాపై పవన్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ముఖ్యంగా కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం తరలి పోకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అదేసమయంలో రేషన్ మాఫియా పై ఉ క్కుపాదం మోపుతున్నట్టు కూడా ప్రకటించారు. ఇక, ఇప్పుడు అటవీ సంపద, భూములు, ముఖ్యంగా ఎర్రచందనం వంటి వాటిని సీరియస్‌గా తీసుకున్నారు. అయితే.. ఇక్కడే పలు సందేహాలు తెరమీదికి వస్తున్నాయి. పవన్ ఇప్పటి వరకు ఆగ్రవేశాలు ప్రదర్శించినా.. వాటి లో రిజల్ట్ మాత్రం కనిపించలేదు.ఇదీ.. ఇప్పుడు జరుగుతున్న చర్చ. తాజాగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కార్నర్ చేస్తున్నారన్న వాదన వైసీపీ నుంచి వినిపిస్తున్న నేపథ్యంలో పవన్ ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు.. ఇచ్చిన ఆదేశాలతో ఏమేరకు సక్సెస్ అయ్యారన్నది ప్రశ్న. అయితే..గతంలో సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపి.. పోసాని కృష్ణ మురళి సహా అనేక మందిని లైన్‌లోకి తీసుకువచ్చినట్టే.. ఇప్పుడు కూడా అదే తరహాలో అక్రమార్కు లకు చెక్ పెడతారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అదేవిధంగా రేషన్ అక్రమాలకు సంబంధించిమాజీ మంత్రి పేర్ని నాని కుటుం బంపై కూడా అప్పట్లో చ ర్యలు తీసుకున్నారు. దీంతో కృష్ణాజిల్లాలో అక్రమాలు దారిలో పడ్డాయి. ఇలానే ఇప్పుడు దృష్టి పెట్టిన సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇతర నేతల మాదిరిగా పవన్ తొందర పడే మనస్తత్వం లేదని. ముందుగా అధ్యయనం చేసి.. నెమ్మదిగా కార్యాచరణను ప్రారంభిస్తారని అంటున్నారు. చివరకు అక్రమార్కులకు చుక్కలు చూపించడం ఖాయమని జనసేన వర్గాలు చెబుతున్నాయి.

# బీహార్ సీఎం నితీష్ కాదు....బిగ్ ట్విస్ట్ ?



న్యూఢిల్లీ,బీజేపీ జేడీయూ సక్సెస్ ఫుల్ కాంబోతో బీహార్ లో మొత్తానికి మొత్తం సీట్లు దోచేశారు. విపక్షానికి పూర్తిగా బలహీన పక్షం చేసేశారు. ఎన్నడూ లేని విధంగా బీహార్ చరిత్రలో కనీ వినీ ఎరగని విధంగా ఎన్డీయే దుమ్ము రేపింది. అంతే కాదు బీహార్ ప్రస్తుత సీఎం నితీష్ కుమార్ కి ఇది రికార్డు షాయి విష యం ఆయన ఇప్పటికి తొమ్మిది సార్లు సీఎంగా ప్రమాణం చేసారు. నాలుగు ఏకంగా రెండు దశాబ్దాల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఈసారి గెలుపుతో పదవసారి ఆయన సీఎం గా ప్రమాణం చేసి కుర్చీ అధిషించాలని చూస్తున్నారు. బీహార్ లో జేడీయూ సాధించిన విజయం తక్కువ ఏమీ కాదు, ఏకంగా 101 కి84 సీట్ల దాకా సాధించింది.దాంతో కాబోయే సీఎం అని అంతా అంటున్నారు.

జేడీయూ హింట్ :

ఈ నేపథ్యంలో శుక్రవారం ఒక వైపు రిజల్ట్స్ వస్తూండంగా జేడీయూ కార్యకర్తలు సోషల్ మీడియాలో నితీష్ సీఎం అంటూ మళ్ళీ ఆయనే అని ట్వీట్లు చేస్తూ వచ్చారు. అయితే మధ్యలో ఏమైందో ఏమో సడెన్ గా ట్వీట్లు అన్నీ డిలిట్ అయిపోయాయి. దాంతో ఏమి జరుగుతోంది అన్నదే అంతటా చర్చగా ఉంది. నితీష్ కుమార్ సీఎం కారా, ఆయన ప్లేస్ లో ఎవరు అన్నది కూడా సరికొత్త చర్చకు దారి తీస్తోంది.

బీజేపీ పెద్ద పార్టీ :

బీహార్ ఎన్నికల్లో బీహార్ 93 సీట్లతో పెద్ద పార్టీగా అవతరించింది. అంతే కాదు మరో మిత్ర పక్షం అయిన ఎల్జేపీ కూడా 23 సీట్ల దాకా గెలుచుకుంది. ఇతర మిత్రులు అందరికీ కలిపితే మెజారిటీ మార్క్ సాధించవచ్చు. ఇక జేడీయూ ని ఈసారికి పక్కన పెట్టేసి బీజేపీ ముంచి అభ్యర్ధిని ముఖ్యమంత్రిగా చేయాలని కాషాయం పార్టీ ఆలోచిస్తోంది. ఎన్నికల ముందు కూడా ఇదే వినిపించింది. అయితే దానిని ఎన్డీయే నేతలు కొట్టిపారేశారు. కానీ నితీష్ మా సీఎం అభ్యర్ధి అని చివరిలో ఒకటి రెండు సందర్భాలలో తప్ప స్పష్టంగా ఎక్కడా చెప్పలేకపోయారు.

మహారాష్ట్ర ఫార్ములా :

ఇక మహారాష్ట్రంలో చూసుకుంటే అక్కడ షిండే శివసేన అజిత్ పవార్ ఎన్సీపీతో పోటీ చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ ముఖ్యమంత్రి పదవిని మాత్రం తాను చేపట్టింది. దేవేంద్ర ఫడ్నవీస్ ని సీఎం గా చేసి మిత్రులు ఇద్దరికీ ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టింది. ఇపుడు అదే ఫార్ములాను బీహార్ లో కూడా అమలు చేయాలని చూస్తోంది అని అంటున్నారు. నితీష్ కుమార్ ని పక్కన పెట్టి సామ్రాట్ చౌదరిని కొత్త సీఎం గా చేయాలని బీజేపీ చూస్తోంది అని వార్తలు వస్తున్నాయి.

ఉప ముఖ్యమంత్రి గా :

ఇక ఎవరీ సామ్రాట్ చౌదరి అంటే అంగబలం అర్ధ బలం ఉన్న వారు, బీజేపీకి గట్టి నాయకుడు, ప్రసుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయనే 2025లో సీఎం అవుతారు అని అంతటా ప్రచారం సాగింది. ఇపుడు ఇదే జరగబోతోంది అని అంటున్నారు. హిందీ బెల్ట్ లో అన్ని రాష్ట్రాలలో బీజేపీ సీఎం పదవులు అందుకున్నారు కానీ ఒక్క బీహార్ లో మాత్రం అది జరగలేదు.దాంతో ఈసారి ఆ ముచ్చట తీర్చుకోవాలని బీజేపీ కచ్చితంగా ఒక ఆలోచనలో ఉంది అని అంటున్నారు.నితీష్ కుమార్ ఇవన్నీ చూస్తూ ఊరుకుంటారా ఆయనకు కేంద్రంలో ఇంతకు మించి కీలక పదవి ఇచ్చి సర్దుబాటు చేస్తారా చూడాల్సి ఉంది.

# ఏపీ అభివృద్ధికి.. విశాఖ సదస్సు ఆభరణమే..!



అమరావతి,విశాఖలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెండు రోజుల భాగస్వామ్య సదస్సు రాష్ట్రానికి, రాష్ట్ర అభివృద్ధికి కూడా కీలక ఆభరణంగా మారుతుందనడంలో సందేహం లేదు. 17 మాసాల పాలనలో తీసుకువచ్చిన పెట్టుబడులు.. ఇప్పుడు జరుగుతున్న సదస్సు.. వంటివి కీలకంగా మారాయి.ఈ రెండు రోజులు జరిగే ఈ సదస్సు కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఎంఓయూలు కుదుర్చుకోనున్నారు.వివిధ దేశాలకు చెందిన మంత్రులు, ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖ సంస్థలకు చెందిన ఛైర్మన్లు, ప్రతినిధులు ఈ సదస్సుకు రానున్నారు. 50కు పైగా దేశాల నుంచి 3000 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. తద్వారా ఏపీ రాష్ట్ర ప్రగతి, విశాఖ ఉన్నతి కూడా వారికి తెలిసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. యూకే, యూఏఈ, సౌదీ ఆరేబియా, రష్యా, బెహ్రెయిన్, ఖతార్, న్యూజిలాండ్, సింగపూర్ సహా మరికొన్ని దేశాలకు చెందిన మంత్రులు, ప్రభుత్వ ప్రతినిధులు భాగస్వామ్య సదస్సులో పాల్గొంటున్నారు.ఆసియా, యూరప్, నార్త్ అమెరికా, సౌత్ అమెరికా, ఆఫ్రికా, ఓషేనియా వంటి ప్రాంతాలకు చెందిన వివిధ విదేశీ సంస్థల ప్రతినిధులు పార్టనర్ షిప్ సమ్మిట్ కు హాజరవుతున్నారు. ఈ సదస్సులో మొత్తంగా 45కు పైగా సెషన్స్ నిర్వహించేలా ప్రణాళికను సిద్దం చేశారు. తొలి రోజున సుమారు 25 సెషన్స్ జరగనున్నాయి. ఒకే సమయంలో నాలుగు సెషన్స్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఇక విశాఖలోని రెండు రోజుల భాగస్వామ్య సదస్సుపై భారీ అంచనాలే ఉన్నాయి.

భవిష్యత్తు బంగారం..!

ట్రేడ్, ఫ్యూచర్ ఆఫ్ ఇండస్ట్రీయలైజేషన్, సస్టెయినబులిటీ అండ్ క్లైమెట్ యాక్షన్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్, గ్రోత్, జియో ఎకనమిక్ ఫ్రేమ్ వర్క్, ఇంక్లూజన్ వంటి అంశాలపై సదస్సులో వివిధ స్థాయిల్లో చర్చలు జరపనున్నారు. ఆయా అంశాలపై చర్చలు జరుపుతూనే... వివిధ పారిశ్రామిక వేత్తలతో విడివిడిగా నిర్వహించే వరుస భేటీల్లో పెట్టుబడులను ఆకర్షించనున్నారు. తద్వారా భవిష్యత్తును బంగారు మయం చేయనున్నారనడంలో సందేహం లేదు.

# జూబ్లీ గెలుపు... రేవంత్ రాజకీయాలకు మలుపు!



హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం దక్కించుకుంది. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి ఆదిత్యం ప్రదర్శిస్తూ వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ విజయాన్ని నమోదు చేశారు. అయితే ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర ఇప్పుడు కీలకంగా మారిందన్న చర్చ నడుస్తోంది. వాస్తవానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ వచ్చిన తర్వాత దాదాపు పది రోజులపాటు కాంగ్రెస్ చర్చల్లోనే మునిగిపోయింది. అభ్యర్థి ఎంపిక నుంచి ప్రచారం వరకు అధిష్టానం అనుమతి కోసం ఢిల్లీ చుట్టు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇక అప్పటికే బిఆర్ఎస్ పార్టీ ప్రచారానికి దిగిపోవడం, అభ్యర్థిని ప్రకటించడం, బిఫారం కూడా ఇచ్చేయటం వెనువెంటనే ఒక ప్రణాళిక ప్రకారం జరిగి పోయాయి. దీంతో పోల్చుకున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ వెనకబడిన వాదన బలంగా వినిపించింది. ఇక ప్రచార సరళిలో కూడా బీఆర్ఎస్ పార్టీ నాయకులు దూకుడుగా వ్యవహరించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు చాలా బలంగా ప్రభుత్వంపై ఎదురు దాడి చేశారు. అదేవిధంగా గతంలో తాము అమలు చేసిన పథకాలను ప్రచారంలోకి తీసుకురావడం ద్వారా ప్రజలను తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు.అయినప్పటికీ చివరి నాలుగు రోజులు అంటే ఎన్నికల పోలింగ్ కు ముందు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. దీనిలో ప్రధానంగా సీఎం రేవంత్ రెడ్డి పాత్ర తిరుగులేదనే చెప్పాలి. బహిరంగంగా ప్రచారం చేయడంతో పాటు బహిరంగ సభల నిర్వహించారు. అదేవిధంగా మీడియా పాయింట్లలో విస్తృతంగా ఆయన ప్రచారం చేశారు. పలు ఛానళ్లకు ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు. తద్వారా అనూహ్యంగా చివరి నాలుగు రోజులు కాంగ్రెస్ పార్టీ పుంజుకుని బలమైన విజయాన్ని దక్కించుకునే విషయంలో రేవంత్ రెడ్డి కీలకపాత్ర పోషించారు అన్నది రాజకీయ వర్గాలు చెబుతున్న మాట.ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఈ విజయం ప్రత్యక్షంగా నవీన్ యాదవ్ కు దక్కితే పరోక్షంగా ఈ విజయం రేవంత్ రెడ్డికే దక్కుతుందని పలువురు వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం. ఇప్పటివరకు మంత్రులు సహా పార్టీ నాయకుల్లో రేవంత్ రెడ్డి పై ఉన్న అనుమానాలు, అసహనం, అసంతృప్తి వంటివి పటాపంచలు అవుతున్నాయి అన్నది విశ్లేషకుల మాట. ఒక విజయంతో రేవంత్ రెడ్డి పుంజుకున్నారని కూడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా జూబ్లీహిల్స్ విజయం కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఉత్సాహాన్ని తీసుకురావడంతో పాటు ప్రభుత్వం పై ఉన్న అనుమానాలను అదేవిధంగా అసంతృప్తి అనే మాటను కూడా లేకుండా చేసిందన్నది విశ్లేషకుల అంచనా.

# కాంగ్రెస్ విజయంతో కేసీఆర్ మాస్టర్ ప్లాన్ సక్సెస్.. అసలు వ్యూహం ఇదే !!



హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వ్యవహారం ముగిసింది. కాగా మంగళవారం ( నవంబర్ 11, 2025 ) జరిగిన పోలింగ్ అనంతరం అన్ని ఈవీఎంలను భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.నేడు (నవంబర్ 14, 2025) కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ నిర్వహించారు. దాదాపు 25 వేల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ విజయ దుందుభి మోగించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నుంచే ఆధిక్యం కనబరిచిన నవీన్.. ఈవీఎం లెక్కింపులోనూ మొదటి రౌండ్ నుంచే దూసుకుపోయి గ్రాండ్ విక్టరీ కొట్టారు.కాగా కేవలం ఒక మూడో రౌండ్‌లో మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థి స్వల్ప మెజారిటీ సాధించినప్పటికీ.. ఆ తర్వాత కాంగ్రెస్ మళ్లీ జోరు అందుకోవడంతో కారు పార్టీ వెనుకంజ వేయక తప్పలేదు. మొత్తంగా బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత రెండో స్థానంతో సరిపెట్టుకోగా.. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి డిపాటిజ్ కోల్పోయారు. దాంతో కౌంటింగ్ మధ్యలోనే కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లిపోయారు దీపక్ రెడ్డి. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి పరాభవానికి ఇవే కారణాలు అంటూ జోరుగా చర్చ నడుస్తోంది. కానీ మొత్తానికి కాంగ్రెస్ విజయంతో కేసీఆర్ మాస్టర్ ప్లాన్ సక్సెస్ అయ్యిందని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఓటమికి కారణాలు..?

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి పరాభవం ఎదురవడానికి కారణాలు ఇవే అని పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అందులో ముఖ్యంగా పార్టీ అధినేత కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోవడం ఒక పెద్ద లోపంగా పరిగణిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా వారం రోజుల పాటు ప్రచారం నిర్వహించినప్పటికీ.. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ మాత్రం దూరంగా ఉ న్నారు. ఏఏ కారణంగానే కాంగ్రెస్‌కు ఘన విజయం.. బీఆర్ఎస్‌కు అనూహ్య పరాజయం ఎదురైందని అంటున్నారు.అంతే కాకుండా కేసీఆర్ ప్రచారంలో పాల్గొని ఉంటే.. బీఆర్ఎస్‌కు ప్రజల్లో మరింత ఉత్సాహం నిండేదని చెబుతున్నారు. ఆయన ప్రసంగాలు ఓటర్లను ఆకట్టుకునేవని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల తర్వాత నుంచి ప్రజలకు కేసీఆర్ దూరంగానే ఉంటూ వస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో అడపాదడపా పాల్గొంటున్నారు. ఇదే విషయాన్ని కాంగ్రెస్ నేతలు సైతం టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. కేసీఆర్ ఒక నాయకుడిలా కాకుండా, దొరలా పాలిస్తున్నారనే కామెంట్స్ సైతం చేశారు. అందుకే బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయిందని మండిపడ్డారు.

కేసీఆర్ వ్యూహం ఇదేనా..?

అయితే ఓ వైపు వరుస పరాజయలు, మరోవైపు కుటుంబంలో గొడవలు కారణంగా కేసీఆర్ కాస్త సైలెంట్ గా ఉంటున్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని కూడా చెబుతూ రాబోయేది తమ ప్రభుత్వమే అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా గత పదేళ్లలో తాము వైఫల్యం చెందలేదని.. ప్రజలు ఒక అవకాశం మాత్రమే ఇద్దామని కాంగ్రెస్ కి ఛాన్స్ ఇచ్చి తప్పు చేశారని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ తరుణంలో ఉప ఎన్నికలో కేసీఆర్ ప్రచారం చేసి, బీఆర్ఎస్ ఓడిపోయి ఉంటే, అది ఆయనకు పెద్ద దెబ్బ తగిలి ఉండేది. ఆయన వచ్చినా గెలవలేదని కాంగ్రెస్ విమర్శించే అవకాశం ఉ ండేది.అందుకే ప్రచారానికి కేసీఆర్ దూరంగా ఉండి.. కేటీఆర్ ని ముందు ఉ ంచి తాను వ్యూహం అమలు చేశారని అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల ఓటమి బాధ్యత కేటీఆర్ ఖాతాలో పడిందని, కేసీఆర్ మాత్రం ఈ పరాజయం నుంచి తప్పించుకున్నారని తెలుస్తోంది. ఇప్పుడు తాను ప్రచారం చేసి ఉంటే గెలిచేదని.. బీఆర్ఎస్ కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టేందుకు కేసీఆర్ కి అవకాశం ఉ ంటుంది. అందుకే రాజకీయాల్లో గెలుపోటముల కంటే.. సరైన వ్యూహరచన కీలకమని అంటున్నారు. ఒకవేళ వ్యూహం బెడిసికొడితే రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఇకపై కల్వకుంట్ల కవిత కాదా..?



హైదరాబాద్,సాధారణంగా భారతీయ సంప్రదాయంలో వివాహం అయిన అనంతరం మహిళలు తమ భర్త ఇంటిపేరును స్వీకరించడం తెలిసిందే. అయితే రాజకీయాల్లో పెద్ద పెద్ద పదవుల్లో ఉన్నవారి కుమార్తెలు వారి పుట్టింటి పేరునే కంటిన్యూ చేస్తుంటారు. ఉదాహరణకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితను చెప్పుకోవచ్చు. అయితే ఇప్పుడు కవిత తన పుట్టింటి నుంచి వచ్చిన ఇంటి పేరును వదులుకోనున్నారనే ప్రచారం ఓ వర్గం మీడియాలో చక్కర్లు కొడుతోంది.అవును... బీఆరెస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కుమార్తె.. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన ఇంటి పేరును తొలగించుకుని.. ఆమె తన భర్త అనిల్ కుమార్ ఇంటిపేరు 'దేవనపల్లి'గా మార్చుకుని.. ఇకపై తనను తాను దేవనపల్లి కవితగా మార్చుకుంటుందని కథనాలొస్తున్నాయి. ఈ నిర్ణయం వెనుక పలు కీలక కారణాలు ఉన్నాయని అంటున్నారు.వాస్తవానికి బీఆరెస్ నుంచి బయటకు వెళ్లిన తర్వాత కవిత తన తండ్రి ఇంటిపేరును పెట్టుకోవడం ద్వారా ఆమె తిరిగి బీఆరెస్ వైపు చూసే అవకాశాలున్నాయనే ప్రచారం జరుగుతుందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే... ఈ విమర్శలను తిప్పికొట్టడానికి ఆమె ఇకపై తన భర్త ఇంటిపేరును పెట్టుకోవాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. తద్వారా రీబ్రాండింగ్ దిశగా ఆలోచిస్తున్నారని చెబుతున్నారు.కాగా... గత నెలలో కవిత ఒక కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ప్రజల్లోకి వెళ్తూ నాలుగు నెలలపాటు యాత్ర చేపడుతున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు పోస్టర్ లాంచ్ చేసిన అనంతరం ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్యమ కారులు, అమరవీరుల త్యాగాలకు అర్థం ఉండాలంటే సామాజిక తెలంగాణ రావాలని.. అందుకే యాత్రను చేస్తున్నట్లు తెలిపారు.అయితే ఈ యాత్రలో తన తండ్రి, బీఆరెస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఫొటో ఉండబోదు అని ఆమె స్పష్టం చేశారు. అయితే... ఇది కేసీఆర్ ను అగౌరవపరిచే ఉద్దేశం ఎంతమాత్రం కాదని.. కేసీఆర్ లేకుండా తెలంగాణ ఉద్యమం, తెలంగాణ లేదని చెబుతూ... కాకపోతే చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకునే మనస్తత్వం తనకు లేదని.. ఆ చెట్టు కింద దుర్మార్గులు ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే "కల్వకుంట్ల" ఇంటిపేరునూ మార్చుకోనున్నారని అంటున్నారు!

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com